The Jubilarians

Dr. SadaSiva Rao

Dr. JayaPradamba



THE JUBILARIANS

"JEEVANI"

“JEEVANI”

FRONT VIEW OF NURSING HOME

Professor N. G. RANGA

(President)

Dr (MRS) JAYAPRADAMBA AT HER DESK



MATERNITY BLOCK

CHIEF GUEST

Dr. D. JAGANNATHA REDDY, M. D. DIRECTOR, S. M. V. MEMORIAL HOSPITAL & RESEARCH CENTRE

AND

FORMER VICE - CHANCELLOR OF SRI VENKATESWARA UNIVERSITY, THIRUPATI.



Dr. SADASIVA RAO

Dr. (Mrs.)

K. JAYAPRADAMBA



D. V. RAMABALA

(Eldest Daughter)



Dr. V. SURESH

(Eldest Son-in-law)

Dr. C. UMA BALA

(Second Daughter)



Dr. C.V. SUBHA RAO

(Second Son-in-law)



Mr. K. RAMESH

(Elder son)



A. SRIVALLI

(Daughter-in-law)

K. USHA BALA

(Youngest daughter)



Mr. P VISHNUPRIYA RAO

(Youngest son-in-law)



Mr. K. SURESH

(Younger son)



Master V. SAMEER

(Grand Son)

OUR HOMAGE

Late Dr. M. V. RAMANAMURTHY F.R.U.S.,

AN IDEAL TEACHER

OUR HOMAGE



Late Sri P. SURAIAH

To whom Dr. K. Sadasiva Rao is indebted to, for what he is today

OUR HOMAGE

LATE MISS. C. ASHA KUMARI

Inheritor of unfulfilled renown, Asha lives on.



DR. K. SADASIVARAO * DR. G. ETHI RAILLU * DR. Y. PRATHAP KUMAR

Dr. SADASIVA RAO being honoured for his appointment as Honorary professor of Govt. General Hospital Guntur.

DOCTORS WITH OLD STAFF



DOCTORS WITH PRESENT STAFF

DOCTORS IN THE OPERATION THEATRE

Dr. K. SADASIVA RAO at Opening ceremony of Laxmi Nursing Home, Guntur.

Sitting: [From L to R) 1. DR. C. V. SUBBARAO 2 DR. Y. PRATHAP KUMAR 3. SRI. JAGARAMUDI CHANDRA MOULI (President) 4. DR. K. BASAVA PUNNAIAH & 5. Rtn. P.D.G.V. UMA MAHESWARA

Standing (from L to R) 1 MR. D. BAPAIAH 2. DR. V. SURESH, 3. DR. J. S. RAMARAO, 4. DR. M. S. S. KOTESWARA RAO

HIPPOCRATES MEDICINE BECOMES A SCIENCE

RAJ BHAVAN

LUCKNOW

Naini Tal,

July 7, 1976

My dear K. Sadasiva Rao,

Received your telegram just now.

Thank you very much for your inviting me for the Silver Jubilee of Nursing Home and marriages of children. During my last visit to Hyderabad, you had mentioned that you were considering these functions sometime in August. In view of my commitments here, I am afraid, it will not be possible for me to leave the State during these dates. I wish the functions all success and send you my best wishes in advance.

With best wishes,

Yours Sincerely,

(M. Chenna Reddy)

NEW DELHI

277.76

K RAGHURAMAIAH

Union Minister For

Parliamentary Affairs

Dr. K. SADASIVA RAO

WISHING THE FUNCTION EVERY SUCCESS

K. RAGHURAMAIAH

HYDERABAD

26.7. 76

Dear Dr., Sadasiva Rao,

Heartiest congratulations.
Wish the Silver Jubilee celebrations
every success

Yours
M. V. Krishna Rao
Education Minister
A. P.

Hyderabad.

25776

Chanamolu Venkata Rao

Minister for PWD

Dear Dr. Sadasiva Rao garu,

I am in receipt of your invitation to participate in the Silver Jubilee Celebrations of Peoples Nursing Home at Guntur on 28th July, 76. I regret my inability to attend in person as the Andhra Pradesh Legislative Assembly and Council are in session.

I wish the celebrations all success,

(Ch. Venkata Rao)

ఘంటసాల,

26.7.76

గొట్టిపాటి బ్రహ్మయ్య

Former Chairman, Legislative council

పూజ్యశ్రీ

డాక్టరు సదాశివరావు గారు,

డాక్టర్ జయ ప్రదాంబగారు,

నమస్కారములు..

మేము, బంధు మిత్రులతో మీరు కులాసా అని తెలుస్తాదు. చిరంజీవుల వివాహ శుభ లేఖ చూరు కొని ఆనందించాను...

నూతనవధ్యూలను

చి॥ సౌ ఉషాబాల

చి॥ విష్ణు క్రియరావులన

చి ॥సౌ **శ్రీ వల్లీ** రాణి

చి॥ రమేష్‌లను

ఆశీర్వదిస్తున్నాను. వీరికి వీరి సంతతికి దై వాశీర్వచనలు ఎప్పుడు ఉండును గాక. ఈ శోభ సమయాన మీ దంపతులను అభినందిస్తున్నాను. మిత్రులకు వందనాలు..

వయస్సును బట్టిప్రయాణాలు

చేయజాలకున్నా, శుభముహూర్త్ భవదీయుడు

సమయాసహాజరు కాజాలనం గొ॥ బ్రహ్మయ్య

దులకు విచారిస్తున్నాను.

గో ॥ బ్రహ్మయ్య



Telephone: 32263

ANDHRA JYOTI
"LUMBINI, ROAD No 7
BANJARA HILLS,
HYDERABAD500034

Neither journalism nor medicine are mere means of livelihood; they are modes of public service too. Having realized this right at the outset of their brilliant career, Dr K Sadasiva Rao and his wife Dr Jayaprada, named their clinic the People's Nursing Home" and are running it in such a way as to justify its name. Now that they are joined in their good work by some of their children, it would. I am sure, make further progress in every direction. I send them my affectionate greetings on the occasion of the Silver Jubilee of their Nursing Home

V.R. NARLA
(EDITOR)

ANDHRA UNIVERSITY
WALTAIR
VISAKHAPATNAM530003
Dr. 13th July 1976

Dear Dr. Sadasiva Rao Garu,

Thanks for your kind letter dated 10th July. I am glad to know that the Silver Jubilee of your Nursing Home will be celebrated on 28th July.

I have a meeting of the Fulbright Foundation in Delhi on the same day. I therefore regret my inability to accept your invitation to be a Chief Guest at the function.

I wish the Celebrations success.

Yours sincerely,
(M. R. APPAROW)

SRI VENKATESWARA UNIVERSITY

Tirupati 517 502

Andhra Pradesh

18 June 1976

I felicitate Dr & Smt. K. Sadasiva Rao on their completing 25 years of medical practice, and wish them many years of happiness and service to the society.

I knew these two doctors intimately during my 3 years stay in Guntur, and from what I observed and from what other people told me they were giving free medical help to students and poor people. They were also organising monthly meeting of poets, writers and artistes. Dr. Sadasiva Rao along with other friends like Shri Jagarla mudi Chandramouli has also served the cause of collegiate education by establishing the JKC college, which, I hear, is one of the good colleges in that area

It is appropriate that friends and admirers of Dr. & Smt. Sadasiva Rao should celebrate the Silver Jubilee of their medical careers.

(K. SATCHIDANANDA MURTY)

Phone 411436
"SHANTAM"
PERUNGUDI P.O.
Madras600 096
11 71976.

Dr. K. S. SANJIVI, MD., F.A.M.S.,
Professor Emeritus in Medicine,
Madras Medical College

Dear Doctors K. Sadasiva Rao and Jayapradamba,

I have your communications regarding the Silver Jubilee Celebrations of the Peoples Nursing Home Guntur. It is very kind of you to have invited me to attend the function I am afraid I may not be able to come over to Guntur for the function. I send you my heartiest congratulations and best wishes for continued and useful services to the community.

With best regards,

Yours Sincerely,
K. S. Sanjive

విషయ విపంచి

మా మాట 31

రజతపుష్పం 37

ఆదర్శ వైద్య దంపతులు 40

మంచి తనం 43

సాహితి ప్రియుడు సదాశివుడు 45

క్రొత్త టానిక్ 47

మన డాక్టరు గారు 49

సేవాతత్పరత 51

అంజలి 53

మనస్సు అతీంద్రియజ్ఞానం 56

నిజమైన స్నేహితులు 61

అక్షరాక్షతలు 65

ప్రజా వైద్యులు 67

కల్పశాఖి 68

పండిన కలలు 72

"చల్లని చేయి" 74

నేనూ మా డాక్టరు గారు 77

మా డాక్టర్లు 82

జీవని 84

నా ఆకాంక్ష 85

ఆదర్శ డాక్టర్ దంపతులు 86

రజతోత్సవ సువర్ణాంజలి 92

నాకు నచ్చిన డాక్టర్లు 94

రజతోత్సవ నీరాజనము 101

కృతజ్ఞతాంజలి 103

Therapy In Filariasis....113
Many A Heart Attack Is Preventable....131
Illustrious Couple....157
More general practitioners or specialists for india?....159
Dedicated Service....163
Has smallpox been eradicated from our Country?....165
Some Reminiscences....170
My Acquaintance With The Doctor....180
The Family I Know....184
How To Be A Successful Beneral Practitioner....189
Dr. K. SADASIVA RAO as I know him....201
Quarter Century Of Service....204
Peptide Hormones Diabetes Mellitus....206
The Doctor Couple and the People's Nursing Home; A Few Reminiscences.
....212
Medical & Health Care For The Millions....214

తెలుగు విభాగము

మా మాట

తెలుగు తల్లి ధన్యురాలు, తమ ప్రజా, ప్రాభవాలతో, వివిధ రంగాలలో పేరుగాంచటమే కాక, తల్లి ఋణము తీర్చుకొన్న తెలుగు బిడ్డలెందరో, సేవా భావమే ప్రాణమై, వైద్యవృత్తిలో సేవా శిఖరాగ్రాల నధిరోహించి, ప్రపంచ ఖ్యాతిగాంచిన వారు కొందరు, వైద్యంలోనేగాక, సాంఘిక, రాజకీయ, సాహిత్యకళా రంగములలో గుర్తింపదగిన సేవను "ప్రజా వైద్యశాల" నుండి చేసిన డాక్టరు కాసరనేని సదాశివరావు, వారి సతీమణి శ్రీమతి జయప్రదాంబగారలు ధన్యులు.

ఇరువది ఐదు సేవాసోపానాలను గడచి, పై మెట్టుపై నిలచి నారీనాడు "ప్రజావైద్యశాల'' రజతోత్సవము జరుపుకొనుట అశేష ఆంధ్ర ప్రజానీకానికి ఎంతో సంతోషము. ఈ సందర్భంగా ఈ సంచిక అందించే అవకాశం కలగటం మా అదృష్టం.

డాక్టరు దంపతులు విభిన్న వ్యక్తిత్వాలు కలవారని ప్రతీతి. వటవృక్షము వంటి వారు సదాశివరావుగారు, ఆ చెట్టు నీడనే వుంటూ తనదైన ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని సంతరించు కొన్న ప్రజ్ఞాశాలిని శ్రీమతి జయప్రదాంబ. సదాశివరావుగారు వేగంగా ప్రవహించే జీవనది. అమ్మ జయప్రద కరుణా కమలాలు వికసించిన మంచినీటి కొలను. ఈ భిన్నత్వములోని ఏకత్వానికి చిహ్నం "**ప్రజావైద్యశాల**." వీరిరువురూ బాధానివారణకు చేసిన సేవలు అపూర్వం. అదే ఒక క్రొత్త బాట. తెలుగునాట పండిత పామర జనరంజకంగా పద్యాన్ని ఏ విధంగా తిరుపతి వెంకటకవులు ప్రచారంచేసి సాఫల్యము గాంచారో అలా భయపూరితులూ, సందేహగ్రస్తులూ అయిన రోగులకు శస్త్రవైద్యాన్ని సులభ సాధ్యం చేసి ఘనతవహించారీ దంపతులు.

ప్రజావైద్యశాల నేటి ఆధునిక వ్యాసపీఠం ఇక్కడ వైద్యాన్నే గాక జీవితాన్నే చదివిన విద్యార్థులు కొల్లలు. డాక్టరు దంపతుల శిష్యవాత్సల్యము గొప్పది. నిదర్శనము నేడు ఆంధ్ర దేశములో వెలసిన అసంఖ్యాక "ప్రజావైద్యశాల"లే.

ప్రజావైద్యశాల, సాహిత్య వేదిక, సాహితీ సదస్సు, వైద్యంలోవలెనే కవిత్వంలో కూడా ఉన్నత ప్రమాణాలు సాధించాలనేది వారి ఆదర్శం. అందుకు ప్రామాణిక భాషలో ఆధునిక భావాలు ప్రచారం చేయటం అవసరమని ఈ సదస్సు అధ్యక్షులుగా సదాశివరావు గారి ఆకాంక్ష. కవి పండిత సమాదరణలో సదాశివరావు గారికి శ్రీ తిక్కవరపు రామిరెడ్డి, శ్రీ ముళ్ళపూడి తిమ్మరాజు గారల సరసన పీటవేస్తే అది ఎక్కువ గాదు.

వారి విద్యాసేవకు గురుతులు నేటి జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిగారి కళాశాల, ఇతర విద్యాసంస్థల వంటివి..

సదాశివరావు దంపతులు ఏ ఒక్క పార్టీకి చెందకపోయినా, వీరు రంగాజీకి అత్యంత ఆత్మీయులు.

సదాశివరావు జయప్రదాంబల ప్రజాసేవకు రజతోత్సవసంఘం ప్రచురించిన పత్రిక ఇది. స్వీకరించండి. అభిమానపూర్వకంగా **" ప్రజావైద్యశాల ఎదుట వెలిగించిన దీపం"** ఇది. సందర్శించండి.

సంపాదకులు.

ప్రశంస

కళాప్రపూర్ణ, తెలుఁగులెంక శ్రీ తుమ్మల సీతారామమూర్తి

కాసరనేని దంపతులు
కాసులకంటెఁ బ్రజాసపర్యకున్
వాసి యొసంగి రేపవలు
వందురు వందల వేల రోగులన్
గాసికి దవ్వొనర్చి నవ
కాంతి సమగ్రులఁ జేసి ధన్యతా
భాసురు లౌట సజ్జనుల
పాలిటికిన్ శుభవార్త యై తగున్.

అలసి సొలసి యింటి కర్ధరాత్రము వచ్చి
నిదుర కెదుర సూచు గద విరోధి
యపుడ కదలు నార్తు నాక్రందమున్ విని
చెప్పఁజాల మితని సేవ విలువ.

స్రుక్కు వాని కష్టసుఖములు తనవిగా
సరయువాఁడె వైద్యుఁ డనఁ దనర్చు
నీ కఠోరనిష్ఠ నిరువది యైదేండ్ల
దాఁటి గెల్చెన ! సదాశివుండు.

ఎంత మేటి యైన నేమి యీ డాక్టరు
గలుఁవ గలడె చెలువ చలువ లేక
ఓ జయప్రదాంబ! ఆజ్ఞానజము లైన
నీదు నేర్పు నీదు నేర్పు నెంతు.

ఆలుమగలార! లోక సేవానుకూల
జీవనాసక్తులార! మీత్రోవ నెల్ల
రాదరింపఁగఁ బరమాయురాదు లంది.
మనుఁడు నిర్భరకీర్తి సంపదలఁ గనుఁడు.

వీడుమర లేని వృత్తి గొని
వేసరుచున్న సదాశివుండు నల్
గడల కవుల్ బుధుల్ తనియు
కైవడి సాహితి కొల్వు నీకొనెన్;
విడిముడికే బడల్పడెడి
వెజ్జులు వీనియెడంద వీని మ
న్గడ పరికించి విశ్వహిత
కార్యధురంధరు లౌట యొప్పగున్.

వైద్యశాలా ప్రశంస

శ్రీ చలసాని లక్ష్మీనారాయణవర్మ, కర్షిక కవి

1. శ్రీ జీవని కధినాథుడు
   పూజితుడు, సదాశివార్య పూర్ణాయువుగా
   భూజన, వ్యాధినివారణ
   భాజనుడగు, వరములొసగి భవుడోము సదా.........

2. ఇరువదియైదు వత్సరము లేగి ప్రజా ప్రజ వైద్యశాల,కీ
   తరుణ మెదందలంచి వసుధా మర పాళిని బిల్వబంచి సం
   బరమున నుత్సవంబు సలుపన్ సుముహూర్తము నిశ్చయించి యా
   దరమున, బంధుమిత్ర హరిదాస, కవీశుల కంపె లేఖలన్........

3. పండితవర్యులున్ను కవిపాళి రచించిన గద్యపద్యముల్
   నిండు మనంబుతో నరసి నీటుగ సంచిక నచ్చువేసి, పూ
   దండల సర్వ జేసి, బిరుదమ్ములు దాల్చిన దేశికాళి, రా
   రండని పాదపూజల, కరంబొనరించె, సదాశివుండిటన్.........

4. అనుదిన రోగగ్రస్తుల
   గనుగొని, శోధించి, రుజకు గల, కారణముల్
   మనసార, చర్చ చేయుచు
   ఘనుడనగా సంతతంబుగాంచె, యశంబున్

5. వైద్యాల యౌషధమ్ముల
విద్యార్థుల కిచ్చు చుందు విత్తము గొనకే
హృద్యా సమ వేద్యముగా
సద్యశ మిచ్చెదరు వారు సన్మానముగన్........

6. తెలుగు దేశమందు, పలు పల్లెపట్టులు
పట్టణములలోని ప్రజల నెల్ల
కొద్ది గొప్ప యనక కులభేదమెన్నక
ఆదరించి, జయము లందె, నితడు

7. ధరణి తెలుగు దేశమున, తాము గడించిన విద్యవిద్యలో
మెరుగులు దిద్దుకోదలచి, మీ సముఖంబున కేగు దెంచి, సో
దర సమభావ ముంచి, నిరతంబు శ్రమించిన డాక్టరుల్
బిరుదము లంది లోకమున పేరుగడింపరె వందలాదిగా .....

8. వచ్చిన వారి కెల్లరకు వైద్య మొనర్చి సుఖంబు గూర్చి, వా
రిచ్చిన రొక్క మిబ్బడిగా నిచ్చితి రంచు వచించి కొంత యీ
వచ్చిన మెచ్చి పుచ్చుకొని, వారే, నెబాసని మానసమ్ములో
నచ్చెరు వంది మెత్తు రట! ఔర! సదాశివరావు నీవికిన్.

9. మండల మన్ని దిక్కులను మంచి గడించిన వెజ్జులెల్లరున్
రండని పిల్వనేగి వివరంబుగ దెల్పుచు, నాపరేషనుల్
మెండుగ జేసి బాసటయి, మించిన కీర్తి గడించు కొన్న రా
యుండవు నీవు నూఱు, సమ లున్నతి జెందెద వాంధ్రధాత్రిలో.

రజతపుష్పం

శ్రీ అమరేంద్ర

డాక్టరు సదాశివరావు గారు, వారి సతీమణి జయప్రదాదేవిగారు నిర్మించిన ప్రజా వైద్యశాల రజతోత్సవం జరుపుకోటంలో ఆశ్చర్యం లేదు.

ధనసంపద లక్ష్యం కాకుండ భావంతో వైద్య వృత్తిని చేపట్టి నిర్విరామంగా కొనసాగిస్తున్న దీన జన బాంధవులు వారు. సామాన్యుల ఆర్తిని గుర్తించి ఆపదలలో చేయూత నిచ్చే మాన్యులు వారు.

కొందరి నామధేయాలకూ స్వభావాలకూ వైరుధ్యం వుంటుంది. కాని నిత్యమూ ఇతరులు మేలును ఆలోచించే చిత్తవృత్తి సదాశివ లక్షణం. ప్రజాహిత కార్యాలలో ఎప్పుడూ సదాశివరావు గారు, ముందంజ వేస్తారు. పర హితమే వారి మతం, అభిమతం:

వారు చదువుకున్న హిందూ కళాశాలకు ఆరంభములో ప్రిన్సిపాలుగా పనిచేసి పదవీ విరమణానంతరం ఆర్థిక బాధలకు గురియైన బుద్ధిరాజు రామచంద్రరావు గారికి గురుపూజ జరిపి భూరి విరాళాలు సేకరించి గొప్పగా ఆదుకున్నది ఎన్నటికీ మరుపురాదు. అది వారి విద్యాభిమానానికి గొప్పనిదర్శనం.

సదాశివరావు గారు సదాశయులు. సుహృదయులు, సహృదయులు నిరంతర గ్రంథపఠనాసక్తితో బహుముఖమైన పాండితీ వైభవం సంతరించుకున్నప్పటికీ ప్రకర్షణాడంబరం వారి ధీరగంభీర ఉదార, నిరాడంబర స్వభావానికి విరుద్ధం. సంభాషణల్లో వారి విస్తారమైన సర్వతోముఖపరిజ్ఞానం భాసిస్తూ వుంటుంది. వారి కుశల హస్తంలో మెరిసే శస్త్రానికి ఎంత పదును వున్నదో అంత నిశితధార వారి మేధాశక్తికి వున్నది కదా!

"గంగ పారుచుండు కదలని గతితోడ" అన్నట్లు వారి స్వభావం గంభీరంగా వుంటుంది. ఒక చేతితో చేసే ఉపకృతి రెండో చేతికి తెలియదు. ఎందరు సాహితీవ్రతులు కళారాధకులు డాక్టరు గారి సహాయం పొందారో చెప్పలేము. వారు చేసేది వైద్యం మాత్రమే కాదు. అంధకారం అలముకొన్న ఎందరి మనోమందిరాలలోనో ఆశాదీపికలు వెలిగించారు. చేదుబతుకులలో మధురములు వెలయించిన మానవతామూర్తి వారు.

శస్త్రకళానైపుణ్యంతోపాటు శాస్త్ర ప్రావీణ్యం సంపాదించి వైద్యబోధనా రంగంలో దేశికోత్తములుగా ప్రఖ్యాతి పొందారు. డాక్టరు గారి శిష్యకోటి ఒక్క గుంటూరు మండలంలోనేకాక అమెరికా, కెనడాల వంటి సుదూర ప్రాంతాలలో కూడా గురువు గారి యశశ్చంద్రికలు విస్తరిస్తున్నారు. బోధకులు గానే కాక ఉన్నతాదర్శకాంతి ప్రబోధకులుగా ఎందరి గురుపూజలో అందుకుంటున్న మార్గ దర్శకులు సదాశివరావు గారు.

అనేక విద్యాసంస్థలతో సన్నిహిత సంబంధం కొనసాగిస్తూ, వర్ధమానులైన విద్యార్థులనూ అధ్యాపకులనూ ఎదుర్కొంటున్న జటిల సమస్యలన్నీ చక్కగా ఆకళించుకున్న విద్యాభిమానీ, విద్యావేత్తా మన డాక్టరు గారు.

జాగర్లమూడి కుప్పుస్వామి కళాశాల స్థాపనలో నిర్వహణలో విశిష్టమైన పాత్ర వహించారు. బాలారిష్టాలన్నీ దాటి ఎనిమిదేళ్ల అందాల బాలయైన ఆ కళాశాల ప్రౌఢమైన విద్యాసంస్థల సరసన సగర్వంగా నిలబడగల పటిమను సంతరించుకోటానికి డాక్టరు గారు కార్యదర్శిగా ఎనలేని కృషిచేశారు.

గుంటూరు మండల వాసుల హృదయాలలో ఈ కళాశాల ప్రత్యేకత, గౌరవ స్థానం సంపాదించుకోటానికి డాక్టరు గారి విద్యాశక్తి, విశాలదృష్టి, విజ్ఞతా ఎంతో తోడ్పడ్డాయి.

సరస సాహితీప్రియులు డాక్టరుగారు. అన్ని తరాల, అన్ని తరహాల సాహిత్యమునూ సమదృష్టితో నిశితంగా పరిశీలించి మంచిని గ్రహించగల రాయంచ వివేకం డాక్టరుగారి సారస్వతహృదయానికి ప్రత్యేక సంపద. అందుకే వారు గౌరవాధ్యక్షులుగా నెలకొన్న సాహితీ సదస్సు విరుద్ధ సాహిత్యసిద్ధాంతాలూ, విభిన్న సారస్వతాభిరుచులూ కలిగిన రచయితలకు ఒక విశాలమైన రమణీయ వేదికగా విలసిల్లుతున్నది. దండల వంటి లాంఛనాల ప్రసక్తి లేకుండా, సౌహార్ద మైత్రీ పూరిత వాతావరణంలో సాహితీ సదస్సు నిరాటంకంగా, నిరాడంబరంగా కలాపాలు సాగించుకుంటూపోతున్నది. గుంటూరు నగర సాంస్కృతిక రంగానికి డాక్టరు గారు సమకూర్చిన ఆభరణం సాహితీ సదస్సు.

సర్వతోముఖమైన డాక్టరు గారి కృషి ఇంతగా రాణించటానికి కారణం మా సోదరీ విదుషీమణి జయప్రదాంబగారు బందరు హిందూ కళాశాలలో చదువుకునే రోజుల్లో

నిగర్వంగా నిదానంగా వుండేవారు. ఇప్పటికీ ఆ శాంతసహన స్వభావమే ఆమె ఆభరణం, కార్య నిర్వహణా దక్షత ఆమె అలంకారం.

ఆమె దయార్ద్ర హృదయం నిరుపమానం. తన బిడ్డలను గోముగా తీర్చిదిద్ది తనంతటి వారుగా చేసిన మాతృదేవి. సాహిత్యాభిమానంలో సంఘసేవా పరాయణత్వంలో విద్యార్థి హృదయ వైశాల్యంలో ఆమె డాక్టరు గారికి సహధర్మ చారిణి. ఆమె మితభాషిణి, హితభాషిణి, స్మితభాషిణి. ఆమె చల్లని చూపులతో విరిసే డాక్టరు గారి నివాసం ఆనంద మందిరం. కూతుళ్లూ, అల్లుళ్లూ, కొడుకులూ, కోడళ్లూ అందరూ డాక్టర్లే అవుతున్నారు కనుక వీరిది ఆరోగ్యనికేతం. శరీరమూ హృదయమూ మనస్సూ శాంతితో కాంతితో అన్యోన్యంతో ఆనందంతో అలరారే పండంటి కాపురం వారిది. వచ్చే పోయే అతిథులతో బంధువులతో నిత్య కళ్యాణం పచ్చతోరణంగా విలసిల్లే ఆనంద నిలయం. సౌజన్యానికి సౌహార్దానికి సాహిత్యానికి ఆలవాలమై వీరి నిలయం కల కాలమూ వెలుగొందగలదని నేను గాఢంగా విశ్వసిస్తున్నాను. డాక్టరు దంపతుల అసమాన విశిష్ట వ్యక్తిత్వాలే నా విశ్వాసానికి హేతువులు, సదాశివమైన సత్యసౌందర్య సమాశ్లేషం జయ ప్రదమై నిత్యమూ విరాజిల్లగలదు.

ఆదర్శ వైద్య దంపతులు

డా॥ పి. దక్షిణామూర్తి, తెనాలి.

డాక్టరు కాసరనేని సదాశివరావు, డాక్టరు జయప్రదాంబగారు వైద్య, సాహిత్య రంగాలలో తెలుగుదేశమునకు, ముఖ్యంగా గుంటూరు మండలమునకు గత 25 సంవత్సరాలుగా చేసిన సేన నిరుపమానము; వైద్యులందరికి ఆదర్శప్రాయము. నాబోటి అనేక మంది వైద్యులకు వారు సాహిత్యముపట్ల ఆసక్తిని కలిగించారు. 1965-70 సంవత్సరాల మధ్యలో నేను గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో అసిస్టెంట్ ఫిజిషియన్గా ఉంటున్నప్పుడు, ఈ వైద్యదంపతులతో పరిచయం, సాన్నిహిత్యం ఏర్పడినాయి.

ఇంటర్ మీడియట్ వరకు నాకు భాషయందు, సారస్వతమందు ఎక్కువగా ఉండేది. తెలుగు అభిరుచి వైద్యకళాశాలలో చేరిన మొదలు, 1965 లో ఎం.డి. పూర్తి అగువరకు వృత్తివిద్యలో మనస్సు లగ్నమైయుండుట వలన సాహిత్యమునందు ఆసక్తి చూపుటకు సమయము లభించేది కాదు. అప్పుడు గుంటూరు వైద్యకళాశాలలో సర్జరీలో ఆనరరీ ప్రొఫెసర్ గా, ప్రభుత్వాసుపత్రిలో ఆనరరీ సర్జన్ గాను పనిచేయుచున్న డా॥ సదాశివరావుగారు అటువైద్యవిద్యా బోధనలోను, ఇటు పీపుల్సు నర్సింగ్ హోంలో శస్త్రచికిత్సలతో తీరిక లేక పోయినప్పటికీ "సాహితీసదస్సు"ను ఏర్పరిచి సాహితీపోషణ చేస్తున్నారని తెలిసి వారి మీద నాకు గాఢాభిమానం కలిగింది. వారితో ఎలా పరిచయం కలిగించుకొందామా అనుకొంటుండగా మా సోదరికి శస్త్రచికిత్స వారి ఆస్పత్రిలోనే జరిగింది. తదుపరి మా చిరంజీవులు ఇరువురు వారి ఆస్పత్రిలోనే జన్మించడం జరిగింది.

1967లో "జీవశాస్త్ర విజ్ఞానం" అను అనువాద గ్రంథాన్ని నేను వ్రాసి రెండుపుస్తకాలను డాక్టరు దంపతులిద్దరికి ఇచ్చి మీ అభిప్రాయాన్ని తెలుపమని అభ్యర్థించాను, అప్పటివరకు నన్నొక డాక్టరుగానే తెలిసిన డా॥ సదాశివరావుగారు ''తెలుగులో ఇంత అభిరుచి నీకున్నదని తెలియదు; ప్రతి నెలా సాహితీ సదస్సు సమావేశాలకు తప్పక రావలసింది" అన్నారు. అప్పటినుండి నేను 1970 ప్రారంభంలో గుంటూరు నుండి వెళ్లే వరకు ప్రతిసమావేశానికి హాజరగుచుండేవాడిని. సాహితీసదస్సు సమావేశాలు ఎక్కువసార్లు డాక్టరుగారింట్లోనే జరుగుతూ ఉండేవి.

వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన కవి పండితుల ఉపన్యాసములు, కవితాగోష్ఠులు, స్వీయకవితాగానములు జరుగుతుండేవి. ఈ సాహితీసదస్సు ద్వారానే మా బోంట్లకు ప్రఖ్యాత చిత్రకారులు సాహితీవేత్త శ్రీ సంజీవదేవ్, శ్రీయుతులు జాషువా, తుమ్మల సీతారామమూర్తి, జంధ్యాల పాపయ్య శాస్త్రి, డా॥ అమరేంద్ర, డా॥ జి. వి. కృష్ణారావు. జమ్ములమడక మాధవరామశర్మ కొండవీటి వెంకటకవి, బి.వి నరసింహరావు, మున్నగు అనేకమంది కవిపుంగవులు, పండితులు, రచయితలతో పరిచయ భాగ్యము కలిగినది. తాను వెనుక వుండి ప్రతి సమావేశమును హుందాగా, సర్వజన హర్షణీయముగా డాక్టరు గారు నడిపించేవారు. డా॥ కె. వాసుదేవరావు (బయోకెమిస్ట్రీ ప్రొఫెసరు) డా॥ నరసింహారావు మొదలైన కొంతమంది. యువవైద్యులం తప్పక సదస్సుకు హాజరవు తూండేవాళ్లం.

ఒకసారి నీవు కూడా ఏదైనా విషయం గురించి తప్పక మాట్లాడవలసిందిగా డాక్టరుగారు నన్ను అడిగారు. అంతమంది పండితులముందు మాట్లాడలేనేమోనని నేను సంకోచిస్తూ ఉండగా, డాక్టరుగారు తప్పక మాట్లాడవలెనని నన్ను ప్రోత్సహించారు. 1968 జూన్ లో జరిగిన సాహితీసదస్సులో డాక్టరుగారి ప్రోత్సాహముతో " తెలుగులో దేశభక్తి కవిత" విషయంపై ప్రసంగించాను. ఆదే సభలో పండిత శ్రీ గోపదేవశాస్త్రిగారు కూడ ప్రసంగించారు.

మరొక సారి **"తెలుగు వైజ్ఞానిక గ్రంథాలలో సాంకేతిక పదజాలం'** అనే విషయంపై ప్రసంగించాను. సాహితీసదస్సులో డాక్టరు గారి ద్వారా అలవరచుకొన్న తెలుగు సాహిత్యాభిమానము వల్లనే ఇటీవల "డాక్టరుగారి డైరీ' అనే పేరుతో వైద్య విజ్ఞానవ్యాసావళి వ్రాయగలిగాను. ఈ పుస్తకానికి డాక్టరుగారు "పరిచయం" చేసి నన్ను ఆశీర్వదించారు.

కొన్ని సాహితీసదస్సు సమావేశాలకు డాక్టరుగారు అధ్యక్షతవహించేవారు. వక్తల ఉపన్యాసాలపై తమ అభిప్రాయాలను నిర్మొగమాటంగా స్పష్టీకరించేవారు. కొన్ని సంవత్సరములు సాహితీసదస్సు సమావేశము నెలకు ఒక్కొక్కరియింట జరుగుతుండేది. డాక్టరుగారు సంప్రదాయ కవిత్వాన్ని, ఆధునిక కవిత్వాన్ని సమాన స్థాయిలో అభిమానించేవారు. దేనినీ తక్కువగా చూసేవారు కాదు. డాక్టర్లుగా రోజులో 16గంటలు

తీరిక లేకుండా వ్యాధిగ్రస్తుల బాధానివారణలోను చికిత్సలో నిమగ్నమై ఉండికూడా లభించిన కొద్ది తీరికసమయములో సాహితీపోషణ చేయు వైద్యదంపతులు తెలుగునాటనేగాదు. భారతదేశములోనే అరుదని నా ప్రగాఢవిశ్వాసం.

డాక్టరు సదాశివరావుగారు వైద్యకళాశాలలో ప్రొఫెసరుగా, ప్రభుత్వాసుపత్రిలో సర్జన్ గా చేసిన సేవలు నిరుపమానము. నర్సింగ్ హోంలో ఎడతెగని కృషిసల్పుతూ కూడ ప్రభుత్వాసుపత్రిలో వైద్యవిద్యార్థులకు శిక్షణ, రోగుల చికిత్సచేసి అందరి గౌరవాభి మానములను అందుకొన్నారు. వారు వందలాది వైద్యవిద్యార్థులకు శిక్షణయిచ్చి వారి భవిష్యత్తులను రూపుదిద్దారు. ఆనరరీ సర్జన్ గా వారి సేవలు చిరస్మరణీయములు. డాక్టరుగా అపార వైద్యవిజ్ఞానం, శస్త్రచికిత్సా నైపుణ్యము, సాహితీపోషణ, కవులు పండితుల పట్ల అవ్యాజానురాగాలు. పిన్నలను ప్రోత్సహించే ఔదార్యము ఇవన్నీ నేటి వైద్యులకు ఆదర్శ ప్రాయములు. వారికి చేదోడుగా ఉంటున్న వారి సతీమణి జయప్రదాంబగారు ఆదర్శ వైద్యవిదుషీమణి. ఆదర్శ వైద్యదంపతుల వైద్యజీవిత రజతోత్సవ శుభసందర్భంలో, వారిరువురికి నా కృతజ్ఞతా పూర్వక అభివందనములను సమర్పిస్తూ, వైద్యరంగములో, సాహిత్యరంగములో సేవలు తెలుగు ప్రజలకు కలకాలం లభించాలని ఆకాంక్షిస్తున్నాను.

మంచి తనం

శ్రీ లింగం వీరభద్రయ్య చౌదరి

సౌజన్యం, సహనం, కనికరం, ధర్మబుద్ధి కల్గియుండటం, ఎదుట వారి శ్రేయస్సుకు సంతసించటం కష్టంలో వున్న వారినాదుకొనటం, బీదసాదలకు సహాయ సంపత్తులనందించటం వంటి సుగుణాలను 'మంచితనం' అని చెప్పుతాం. మంచితనం కలవారిని మంచివారంటాం.

మంచి వారిలో అనేక రకాలు అంతస్తులు కలవారున్నారు. ఆకలి కూలికి వచ్చినవాడు, కూలి దొరకక తిరిగి పోతుంటే. పని చేస్తున్న కూలి మనిషి' తనకు తెచ్చుకున్న తిండిలో ఒక ముద్దైనా పెట్టి. ఇంటిలో తిండి లేక అలమటిస్తున్నారనగా, ఏ పావలానో, ఇచ్చి పంపిన కార్మికుడు కనికరమూర్తి. తిండి సరిగా లేక, భార్యాబిడ్డలు చినిగిన బట్టలతో సతమతమౌతున్న బీదవానికి ప్రక్కవాడు ధనవంతుడు కాకపోయినా, ఏ శేరు బియ్యమో ఏ పాత బట్టో ఇచ్చి సమయాని కాదుకుంటే, అది ధర్మ బుద్ధి.

ఈడువచ్చిన కూతురు, పెండ్లి. ఖర్చులు భరించలేక సకాలంలో పెండ్లి చేయలేకపోవుచున్నా, పొరుగు ధనికుడు, మేళ తాళాలతో గొప్పగా తన కూతురు వివాహం చేస్తుంటే, ఈర్ష్యపడకుండా, పెండ్లి పనులు సాయ మిచ్చి తనయింట్లో శుభకార్యం జరుగుతున్నట్లు సంతోషించు వాడు సజ్జనుడు. ధనికుడు తన ధనాన్ని సంఘ శ్రేయస్సు కొరకు, బీదసాదల కొరకుపయోగించు వాడైన అతడు సౌజన్యం మూర్తి (సుగుణవంతుడు) పారిశ్రామిక వేత్త కార్మికులకు కూడా విశ్రాంతి కావాలని జీవితం కూడా సుఖప్రదంగా వుండాలని, నిజాయితీ వర్తనతో మెలగిన అతడు ధర్మబుద్ధి కలవాడు.

భూవసతి ఉన్న ఉన్నవాడు. తన పాలేర్లను, వ్యవసాయ కూలీలను కన్నబిడ్డలవలె చూచుకొనువాడు, వారలను కష్టసుఖాలలో ఆదుకొనుచుండిన ఆర్ద్రహృదయుడు. రాజకీయాలలో పాల్గొనుచు, ప్రజానాయకులని పించుకొన్నవాడు. ప్రజల కార్యాన్ని గూర్చి, వారి ఇబ్బందులను గురించి, తమకు సాధ్యమైనంతవరకు తోడుపడి అవసరాన్ని బట్టి ప్రభుత్వోద్యోగుల దృష్టికి తెచ్చి, అంతకు సాధ్యం కాకపోతే ప్రభుత్వానికి వున్న ఇబ్బందులను తొలగించుటకు ప్రయత్నించేవారు. నిజమైన ప్రజాసేవకులుపై వారి నందరిని మించిన వారిని ఘంటాపథంగా చెప్పవచ్చును.

ఇక వృత్తులవారున్నారు. వారిలో ముఖ్యులున్నారు. వాదులు, వైద్యులు, న్యాయ వాదుల ప్రథమధర్మం, న్యాయబుద్ధి కర్తవ్యం నిజాయితి. చెల్లనేరదని తేట తెల్లమైన కేసుకు కల్లబొల్లి మాటలతో భ్రమింపజేసి కక్షిదారుని పదిసార్లు త్రిప్పితేగాని ఘనంగా రుసుం రాదని భావించి దురాశతో హెచ్చు డబ్బులు గుంజు కొనక తగాదాలు క్షుణ్ణంగా చదివి కోర్టువారు అర్థం చేసికొనునట్లు శ్రద్ధగా విశదీకరించుటకు శాయ శక్తుల ప్రయత్నించు న్యాయవాదియే నిజమైన న్యాయవాది, నిజాయితి కలవాడు.

వైద్యుడు, పై వారందరి కంటెమిన్న. ఆయన సౌజన్యం, కరుణా, సహనం, మానవత, హిప్పోక్రేటెస్ చెప్పిన వైద్యధర్మం మూర్తి భవించిన వాడుగా ఉంటే, అతనిని మంచివాడు అంటే మాత్రమే చాలదు. అందువల్ల నే "**వైద్యో నారాయణోహరిః**" అని పెద్దలన్నారు. ఇట్టి సుగుణ సంపత్తులు, మానవతమూర్తీ భవించినవారు మన డాక్టర్ కాసరనేని సదాశివరావు, డాక్టర్ జయప్రదగార్లు. వారికి డబ్బు ప్రధానం కాదు, మానవసేవ ప్రధానం. వారు మున్ముందుగా చికిత్స చేసేది, ధనవంతులు ఇతర విధంగా గొప్పవారనుకునేవారు కాదు, ముఖ్యంగా బీదసాదలు. అందుకనే వారి చికిత్సాలయం ప్రజా చికిత్సాలయం' (పీపుల్స్ నర్సింగ్ హోమ్) అయింది.

వారి 'ప్రజాచికిత్సాలయ' రజతోత్సవ సందర్భాన, మానవసేవా ధర్మ నిరతులైన ఈ భార్యా భర్తలు డాక్టర్లు సదాశివరావు జయప్రదగార్లకు నా ఆశీస్సులర్పించుచున్నాను.



సాహితి ప్రియుడు సదాశివుడు

శ్రీ గొల్లపూడి ప్రకాశరావు

వైద్యం వృత్తి, సేద్యం వృత్తి. కుమ్మరం వృత్తి, కమ్మరం వృత్తి, ఇంకా సవాలక్ష వృత్తులు. కాని కావ్యపఠనం వృత్తి కాదు. కావ్య సృజనం వృత్తి కాదు. కృతి స్త్రీకరణం వృత్తి కాదు సమర్పణం వృత్తికాదు. కాగూడదు కూడ.

నన్నయ భారతాన్ని రాజరాజ నరేంద్రుకు స్వీకరించాడు. హరిహర నాధుడంతటి వారు తిక్కనకు కలలో కన్పించి కావ్యాన్నడిగాడు. సింగనామాత్యడు శ్రీ నాధుణ్ణి అడిగి నైషధాన్ని అంకితం తీసుకున్నాడు. కృష్ణదేవరాయలు పెద్దన పల్లకీని మోసి మర్యాద చేసి మనుచరిత్ర నందుకున్నాడు. అంకితం ఇచ్చిన కవీంద్రులకు అది వృత్తి కాదు. అంకితం పుచ్చుకున్న మహామహులకూ అది వృత్తి కాదు. కాని కృతిస్వీకర్త పిలిచి పీట వేస్తేనే కృతికర్త అంకితం ఇచ్చేవాడు కాదు.

అడక్కుండా కృతి ఇచ్చే ఆచారం ఆధునికాచారం. ఆరోగ్యకరమైన ఆచారం. కృతి సమర్పణానికి గాని, కృతి స్వీకరణానికి గాని హృదయగతమైన గౌరవాభిమానాలు కారణం కావాలి గాని బాహ్యమైన ఆచారాలు కాదు. తాను స్వీకరించిన అన్ని గ్రంథాలనూ అడగకుండానే అంకితంగా పొందిన ఆదర్శమూర్తి డాక్టరు సదాశివరావు.

సదాశివరావు గారు నిజంగా సదాశయరావు గారు. సాహితీ సదస్సంస్థాపనం ఇందుకు ప్రబల తార్కాణం. ఈ సహృదయునికి **'తృష్ణావర్తమనే'** తన కావ్యాన్ని అయా చితంగా అంకిత మిచ్చిన సుహృదయుడు శ్రీ బోడేపూడి వెంకటరావు గారు. అడగకుండా అంకితమీయడం తనకు తక్కువ తనం అని తాననుకోలేదు. అలా అనుకొనే వారికి వారు చెప్పిన సమాధానం ఇది.

"అడుగని యీవి లాఘవ గుణాస్పద మందురు పెద్ద, లై ననా
యెడద నొకించుకేని స్పృశియింపవు గౌరవ లాఘవస్థితుల్
ఎడపని భావబంధ మది యేమొ యతర్కిత హేతుబంధ మై
యుడు గరగాఁగఁ గబ్బ మిడ నుత్సుకముం బొనరించుఁ జిత్తమున్"

ఈ కృతి కర్తను, ఈ కృతి స్వీకర్తను విప్పడానికి వీల్లేకుండా కట్టిన బంధం భావబంధం. ఈ భావబంధం ఇంత దృఢతరం కావడానికి కారణం కృతిస్వీకర్త సద్గుణాలు.

"స్మిత పూర్వముగ సుధాసేచ నోత్సవముగ
మాట లాడగ నేర్చు మధురిమంబు
పెద్దల గరిమంబు పిన్నల పెరిమంబు
గణియింపఁజాలిన గడుసుఁ దనము
ఆంగ్ల భాషారూఢి నాంధ్ర భాషాప్రౌఢిఁ
జెంది మోదించు రాసిక్యగరిమ
భోగ భాగ్యస్థితి త్యాగశీలోన్నతి
కడఁదాఁక నెఱిఁగిన గఱగఱిక యు
నేకమై ప్రోది గాంచీ నా హృదయ సీమఁ
బాదు కొల్పిన గౌరవ భావమేదొ
యీ చిరుతకబ్బమున్ మీకుఁ గృతి నొసంగఁ
బ్రీతి పూర్వంబు నన్నుఁ బ్రేరేచునయ్య "

'పూదోట ఖండ కృతిని అంకితమిచ్చిన
శ్రీ కొల్లా కృష్ణారావు గారు గూడ సదా
శివుని నిర్మల హృదయాన్ని నుతించారు.
"కలిమి బలిమి గల్గి గర్వమ్ము గనరాని
వెన్నవంటి హృదయమున్న వాని
వంతుకెక్కు కావ్య కాంతుని గావింప
గలిగినాఁడఁ దృప్తి మెలఁగి నాఁడ"

సదాశివరావు గారి ప్రవృత్తి సాహితీ సుధాస్వాదనమైనా వృత్తి రోగసంహరణం, ఆరోగ్య సంరక్షణ, ప్రజాసేవకై వారు ప్రారంభించిన ప్రజావైద్యశాలకు పాతికేండ్ల ప్రాయం వచ్చింది. ఈనాటి ఈ అభివృద్ధికి సదాశివరావు గారి శస్త్ర విద్యానైపుణ్యమే కాదు కారణం జయప్రదాంబ గారి చేతి చలువ గూడ.

సదాశివరావు గారు విజ్ఞానవేత్త. వారితో పరిచయమున్న వైద్యమిత్రులు, వైద్య శిష్యులే ఇందుకు సాక్షులు. అందుకే వారితో మాట్లాడడమే ఒక ఎడ్యుకేషన్. సదాశివరావు గారు సాహితీవేత్త. వారిని కలుసుకున్న ప్రతి పండితుడూ, ప్రతి కవీ ఇందుకు సాక్ష్యం. అందుకే వారితో మాట్లాడడమే ఒక ఇన్స్పిరేషన్.

ఇంతటి వారు కృతి నిమ్మని అడగడం కాదు, కృతిని స్వీకరించడమే అదృష్టం, **'కరుణశ్రీ కవితాశ్రీ'** సమర్పణం ద్వారా ఆ అదృష్టానికి నోచుకున్న నన్ను నేను మళ్లీ మళ్లీ అభినందించుకుంటున్నాను.

క్రొత్త టానిక్

వృత్తికి ఒక ధర్మము ఉన్నది. దానికి నీతి న్యాయము ఉన్నవి. సేవాప్రధానమైన వృత్తులు ఆదర్శనీయములై విలసిల్లవలసి ఉన్నది. అటువంటి వృత్తులను ఆదర్శపురుషులు చేపట్టినట్లయితే వారికృషి మూడు పూలు, ఆరు కాయలై తీరును.

వైద్యవృత్తి ఆదర్శప్రాయమైన వృత్తి. ఐనను అది బెర్నార్డ్ షా కలంపోట్లకు గురి కాక తప్పలేదు. షా వైద్యవృత్తిలో నెలకొన్న అవకతవకలను వ్యంగ్యంగా విమర్శించటం జరిగింది. తన The Doctor's Dilemma పీఠికలో, వైద్యులు ధనాకాంక్షతో అనవసర సందర్భాలలో ఆపరేషన్లు చేసి డబ్బు చేసుకొనటం గర్హించబడింది. వైద్యులను జబ్బులను తయారు చేసేయంత్రాలుగా సృష్టించటం జరిగింది. వృత్తి పట్ల గౌరవభావాన్ని పెంపొందింపలేని వైద్యులను ఈసడించటం జరిగింది. తమ అజ్ఞానం కారణంగా కొందరు వైద్యులు నర్సులకు డాక్టరు కంటే తామే నయమనే ధీమా కల్పిస్తారట! ఎంతదారుణం !!

శాస్త్రీయపద్ధతుల మీద ఆధారపడి నడిచే ఈ వృత్తిలో రోగనివారణోపాయముల విషయంలో ఒక వైద్యునికి మరొక వైద్యునికి పొత్తుకుదరక పోవటం పట్ల షా తమ ఆశ్చర్యాన్ని ప్రకటించారు. రోగి విషయంలో 'పోతే వాడికర్మ ఉంటే నా మహిమ' అనే వైద్యుని ఆలోచనను గేలిచేసారు. సహజంగా మందులతోనే నెమ్మదించే జబ్బుల విషయంలో కూడ వేచి చూసే ఓపిక లేక ఆపరేషన్ చేయాలని చెప్పే వైద్యుల సలహాలు ఎంతటి హాస్యాస్పదాలు! వీటికి ఆర్థికపరమైన కారణాలు వుండి ఉంటాయని, ఆర్థికస్థోమతులేని వైద్యుడు వృత్తినియమాలకు కట్టుబడి పనిచేయటం కష్టమని వివరించటం జరిగింది. వైద్యము శాస్త్రము కాదని, ఒకవేళ అయినా వైద్యుడు దర్జీకంటే మిన్న కాదని, సూక్ష్మజీవుల సంబంధ సిద్ధాంతములన్నీ, మూఢనమ్మకాలేనని కొన్ని చిత్రమైన అభిప్రాయాలను ప్రకటించారు షా.

షా ప్రకటించిన అన్ని అభిప్రాయాలతో ఏకీభవించకపోయినా, తాను దుమ్మెత్తి పోసిన దురలవాట్లు కొన్ని అంటు జాడ్యము వదలలేదు. ఎందరు వైద్యులు ఈనాటికీ జోస్యకారుల వలె జబ్బు విషయమున జోస్యము చెప్పుటలేదూ? అనవసర శస్త్రచికిత్సలు

ఎన్ని జరుగుటలేదు? తమ ఆదాయపు పెంపుదలకు ఎందరెన్ని అక్రమ పద్ధతులను అవలంబించుట లేదు? అటువంటి పరిస్థితులలో బెర్నార్డ్ షా రచనను చదివి ఆనందించే వైద్యులెంతమంది ఉంటారు?

తమ వృత్తిధర్మాన్ని ఒక యజ్ఞంగా భావించేవాళ్ళకు మాత్రమే అది సాధ్యం. తమ వృత్తి పట్ల విశ్వాసము కలిగి ఆదర్శంగా జీవించేవారికి అధైర్యం ఉంటుంది. డాక్టరు సదాశివరావు గారు తాము చదవటమే కాకుండా వైద్యులయిన వారికి, కాని వారికి ఆ నాటకమును ఇచ్చి చదివించటం వారి ఆదర్శ సేవానిరతికి గీటురాయి, మానసికోల్లాసానికి మేలు బంతి. నాటకము నందలి గిలిగింతలకు నవ్వుకొనుచు, సహచరులు తలపెట్టు తప్పుడు పనులకు నొచ్చుకొనుచు రానున్నతరానికి ఆదర్శప్రాయమైన క్రొత్త టానిక్ ను అందిస్తుంటారు. ఆయన, వారి సతీమణి డాక్టరు జయప్రదాంబ గారల బహుముఖ సేవలు పది కాలములపాటు నిలచుగాక.

మన డాక్టరు గారు

డా॥ డి.ఆర్. ఆచార్యులు

డా॥ కె. సదాశివరావు గారితో పరిచయం యేర్పడి నాకు 20 సంవత్సరములు దాటినది. వారి నిండైన విగ్రహం, గంభీరమైన వదనం చూడగానే నిష్కపటి అని నాకు తట్టినది. అంటే మా స్నేహలత నిర్భయంగా సాగిపోతూ వుంది. డాక్టరుగా వారు చేసిన సేవ నాకంటే గుంటూరు ప్రాంతీయులకు ఎక్కువ తెలిసి వుండాలి. అయినా నేను గమనించిన వాస్తవాన్ని నా సోదర అభిమానులకు తెలియ పరుచుటకు ప్రయత్నిస్తాను.

''Rare is to get a guide proper'' అంటాము కదా! అయితే స్వార్ధం తోనో, రోగులను భయపెట్టడం లేక నాలుగు డబ్బులు సంపాదించగానే తానేదో elevated soul (ఉన్నత ఆత్మగలవానిగా) అనుకొని రోగులను నిర్లక్ష్యం చేయడం జరిగే ఈ రోజులలో Rarer still is to get a doctor proper. (సరైన వైద్యుడు లభించటం నిజంగా అరుదే) అనడం సబబేకదా! గుంటూరులో మన డాక్టరు గారు ఈ లోటును తీరుస్తున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులలో జరిగే సేవతో కొంతమంది తృప్తిపడరు. వారికి ఆప్యాయతతో కూడిన మంచి మాటతో ధైర్యం చెప్పటం అవసరం. ఇది private nursing home లోనే సాధ్యపడుతుంది. కానీ ఈ private hospital లో మరొక చిక్కు ఎదురవుతూ వుంటుంది. వృత్తిలో కొంతకాలము డాక్టర్లకు అర్జన మీదనే దృష్టి వుంటుంది. తరువాత ప్రతిష్ఠ మీద, ఈస్థితిలో risk తీసికొని కష్టసాధ్యమయిన రోగులను ఆసుపత్రిలో చేర్చుకోలేరు. కారణం వీరికి ఫలితాలు బాగుండి ప్రతిష్ట పెరిగి తేలికగా సంపాదించాలనే తాపత్రయం వుంటుంది. మన డాక్టరు సదాశివరావు గారు పై తాపత్రయాన్ని అధిగమించి ఎక్కడా ప్రవేశాలు దొరకని రోగులను చేర్చుకొని శాయాశక్తులా సేవ చేస్తున్నారు. ఈ స్థాయి నందుకున్న డాక్టర్ బహు అరుదుగా ఉంటారు. ఈ శిఖరాన్ని అధిరోహించిన డాక్టర్ల సేవను సంవత్సరములతో కొలవడమేమిటి? సేవా విశిష్టతకే ప్రాధాన్యము కదా! ఆ మాటకు వస్తే డాక్టరు దంపతులకు ఈ సన్మానము ఎన్నడో జరుగవలసినది, ఇప్పటికైనా అభిమానులు ఈ సత్కార్యము తలపెట్టినందుకు అభినందనీయులు.

డాక్టరుగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. విద్యార్థులకు చక్కగా బోధించగలశక్తి సంపూర్ణముగా కలదు.

ఒక విద్యార్థికి collar stud అనే ఉదాహరణ వివరించి చెబుతూ ఆ గుండీని చూపించుచుండగా కనుపించారు. ప్రొఫెసరుగా వుంటే మరెంత సేవ చేసేవారో అనిపించింది ఇంకా ఆ ఓర్పు ఆ తీరుచూస్తే.

మాతృభాషయందు ప్రవేశము, అభిరుచి, సాహిత్యఅభిలాష డాక్టర్లలో బహు కొద్దిమందికి లభిస్తుంది. ఈ విషయములో సదాశివరావు గారు మార్గదర్శకులయినారు డాక్టర్లకు. Anatomy, physiology తప్ప ఇతర లోకము తెలయకూడదా? ఏమో, ఈ లోటు వున్న వారు నాకు చాలా పేలవంగా కనిపిస్తారు.

ఒకసారి డాక్టరు గారి దగ్గరకు ఒక యువకుడు వచ్చి మట్లాడుతున్నాడు. అతను అవధానిగారి కుమారుడు అని చెప్పినట్లు నాకు జ్ఞాపకము. డాక్టరు గారు జడ్జిగా వుండగా ఆ యువకుడు వక్తృత్వపోటీలో పాల్గోని ప్రధమ బహుమతిని తెచ్చుకున్నాడు. అదొక దశాబ్దము క్రింద జరిగి వుండవచ్చు. ఆ సంఘటనా విశేషాలను డాక్టరు గారు వివరిస్తూవుంటే ఆ యువకుడు విస్తుపోయినాడు. కొన్ని సంగతులు తనకే జ్ఞాపకం లేవు. ''**మీ జ్ఞాపకశక్తి అపూర్వమండీ**'' అన్నాడు.

థియేటరులో పని అయిపోయిన తరువాత డాక్టరు గారిని సాహిత్యగోష్టిలో దింపితే భోజనం మరిపించవచ్చు. కృష్ణుడు, ధ్రువుడు అనే మాటలు ఎలా వ్రాస్తున్నాము? దీనిని Englishలో వ్రాయాలంటే ఈ సౌలభ్యం తెలుగు భాషలో, తీయని శబ్దములో ఏ మార్పును తెస్తున్నది. ఏ కవి పోకడలో ఈ మెరుగులున్నవి! ఇటువంటి విషయాలను వారు లోతుగా చర్చిస్తుంటే మన మొక Telugu professor ముందు కూర్చున్నట్లు అనిపిస్తూ వుంటుంది. క్లుప్తంగా చెప్పాలంటే డాక్టరు గారు ఒక సంస్థ. కుల,మత వర్గాలకు అతీతులై ఔన్నత్యమును మెచ్చుకోగల ఔదార్యము వారికి వున్నది.

A blend of honesty and intellect is our doctor.
A generous surgeon, a giant in every factor, who happily dares to bear any risk in profession.
And delightfully shares the labour in execution.
Only to be kind, sure, he looks harsh, only to maintain
To serve the vague and misery like a summer fountain
To fret and sweat and fears wiping out others' tears
Does he find time for his fears? No time.

సేవాతత్పరత

శ్రీ యం. ఇన్నయ్య

ప్రజావైద్యశాల రజతోత్సవాలు జరుపుకొంటున్నందుకు సంతోషం. వైద్యశాల వ్యవస్థాపకులు డాక్టరు కాసరనేని సదాశివరావు, శ్రీమతి జయప్రదాంబ గార్ల నిర్విరామకృషి రోగులయెడల సేవాతత్పరత, మానవతా దృష్టి, ప్రేమ ఆదరాభిమానాలు, ఈ ఉత్సవాలను రాయమానం చేసాయి. ఈ శుభసమయమున డాక్టరు దంపతులకు నా అభివందనములు, కృతజ్ఞతాభివందనములు.

డాక్టరు సదాశివరావుగారు పిన్నవయసులో వైద్యవిద్యలో పట్టభద్రులే. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు బంగారుపతకం సంపాదించుకొని, తదుపరి శస్త్రచికిత్సలో పట్టభద్రులై, వెద్యసేవా నిరతలో ఉత్సాహంతో, పలుపెద్దల ఆశీస్సులతో గుంటూరు పట్టణాన ప్రజావైద్యశాల ప్రారంభించారు. ఆయన సహచారిణి శ్రీమతి జయప్రదాంబ, చేదోడు వాదోడుగా, ఒకరిపై నొకరు అనురాగం పెంచుకొనుచు, ఆదర్శగృహిణిగా, 25 సంవత్సరాల నిర్విరామకృషితో రాత్రింబవళ్ళు రోగుల యెడల, వారి సేవ, ప్రేమ, అనురాగాలు, ఆదరణలు మరపురాని స్మృతులు.

రోగనిర్ణయములో, రోగులకు తగు సలహాలు ఇచ్చుటలో పేరు ప్రఖ్యాతులు గడించిన ఈ వైద్యనిపుణులు పుణ్యదంపతులు. ఈ శుభసమయములో వారికి నా నమోవాకములు.

మానవుడు తన గుండెను ప్రేమతో నింపుకోవాలి. పదిమందికి ప్రేమను పంచాలి. ప్రేమ లేనిదే జీవితము లేదు అన్న సూక్తులను డాక్టరు దంపతులు, తమ సేవానిరతితో నిరూపించారు. ఆశ, నిరాశ అనేవి, అవకాశమనే నాణానికి బొమ్మ బొరుసు లాంటివి. ఆశ నిరాశలను, గెలుచుకొన్న డాక్టరు దంపతుల జీవితం ఫలప్రదమైంది.

వైద్యసేవా వృత్తితో పాటు, మాతృమూర్తి జయప్రదాంబ, తమ కుటుంబసభ్యుల నందరిని వైద్య పట్టభద్రులుగా తీర్చిదిద్ది కాసరనేని వంశానికి గౌరవం తెచ్చిపెట్టారు. వైద్య దంపతులు సహృదయులు, స్నేహశీలురు, ఆత్మీయులు, సమతాభావకులు, ఉదారస్వభావులు, ధర్మదాతలు. సాహితీపరులు, కవిపోషకులు, కళాపోషకులు, గ్రంథకర్తలు, రచయితలు, విశాల దృష్టి, ఓర్పు, ఓర్మిబలిమి, ఎన్నెన్నో మాటలతో కొనియాడవచ్చు. ఈ శుభసమయాన వైద్య దంపతులు మరింతకాలం వైద్య సేవావృత్తిలో నిమగ్నమై వారి చల్లని హస్తాలతో మరికొన్ని ప్రాణాలకు ప్రాణం కల్పిస్తారని అశిద్దాము. ఈ పుణ్యదంపతులు శుభప్రదమైన, ఫలప్రదమైన జీవితం గడపాలని కాంక్షిస్తూ, వారు రోగులయెడ వారి సేవాతత్పరతను మరొక్కసారి తలచుకొంటూ, వీరి జీవితాలలో పండువెన్నెల. వెండివెన్నెల, నిండు వెన్నెల ప్రకాశించుగాక.



అంజలి

డాక్టర్ కుర్రా వీరరాఘవయ్య, డాక్టర్ డాలి వీరయ్య

డాక్టర్ కాసరనేని దంపతులకు మా పుష్పాంజలి. వారు నెలకొల్పినది ప్రజా చికిత్సాలయం. దాని రజతోత్సవం మాకెంతో ముదావహం. వారు "**ప్రైవేటు ప్రాక్టీసు**" ప్రారంభించిన నాటి నుండి ఆ రంగములో ఒక నూతనశకం ఆరంభింపబడింది. ఆనాటి నుండి శాస్త్రీయవైద్యం సామాన్య ప్రజానీకానికి అందుబాటు లోనికి వచ్చింది.

డాక్టర్ సదాశివరావు గారు చిన్నతనం నుంచి కష్టపడి విద్యాభ్యాసం చేశారు. దానికి తోడు మంచితెలివి తేటలున్నాయి. కాబట్టే యం.యస్. లో వారు ఆంధ్ర విశ్వవిద్యాలయ **సువర్ణపతకం** పొందగలిగారు. అది ప్రథముడుగాఉత్తీర్ణుడైన ప్రతివిద్యార్థికి, ప్రతిసంవత్సరం సాధారణంగా ఈయబడే స్వర్ణపతకం కాదు. అసాధారణంగా మూడు నాలుగు సంవత్సరాల కొక పర్యాయం ఒక విశిష్టత కలవారికే ఈయబడుతుంది.

వారు వ్యాధిని నిర్ణయించడంలో ప్రజ్ఞావంతులు, సునిశిత బుద్ధులు. వైద్యచికిత్స చేయడంలో శక్తిమంతులు, శస్త్ర చికిత్సలో అందెవేసిన చేయి. అన్నిటికంటే ముఖ్యవిషయం వైద్యశాస్త్రమూలసూత్రాలు వారి కరతలామలకాలు.

వారిది నిండైన విగ్రహం. చిరునవ్వులొలికే ముఖం. రోగులకు వారిని చూస్తే ప్రాణం లేచి వస్తుంది.

పల్లె దిక్కునుండి పట్టణానికి వచ్చినవారు. వారిది మధ్యతరగతి కుటుంబం. అటు పల్లెప్రజలను, ఇటు పట్టణ వాసులను చక్కగా అర్థంచేసుకొన్న వ్యక్తులు. ఎదుటి వ్యక్తిని చూడగానే ఆకళించుకొనే శక్తి కలవారు. మిడిసి పాటు లేదు. ప్రజాహృదయాన్ని చూరగొన్న వారు. దయాహృదయులు, స్వలాభాపేక్ష వారిధ్యేయం కాదు, వైద్యచికిత్సలో మక్కువ ఉంది. తోటి మానవునకు సాయపడే గుణము ఉన్నది.

వారికన్ని విధముల సహధర్మ చారిణి వారి సతీమణి డాక్టర్ జయప్రదాంబ గారు.

ఇట్టి దంపతులు నెలకొల్పిన ''**ప్రజావైద్యశాల**'' ఒక రజతోత్సవమే కాదు. ఇటువంటి ఉత్సవాలు ఎన్నైనా ఇకముందు జరుపుకొంటుందనడంలో సందేహం లేదు.

వారు **'విద్యలేనిదే దేశప్రగతి లేదు'**, అనే విషయం చక్కగా అర్థం చేసుకొన్న మనీషులు. కాబట్టే నాగార్జున విద్యాసంస్థ నొకదానిని స్థాపించారు. ఆ సంస్థ యజమాన్యంలో జె.కె.సి. కళాశాలను ప్రారంభించి అచిరకాలం లోనే పేరెన్నిక గన్న కళాశాలల్లో ఒక దానిగా రూపొందించారు. ఇది వారి దక్షతకు చక్కని నిదర్శనం. అట్లే ఒక ఉన్నత పాఠశాల కూడ నెలకొల్పబడింది. అది కూడ ప్రగతిపథంలో పయనిస్తున్నది.

ఈ విధంగా వారు వైద్యచికిత్స నెరపుచు విద్యాభివృద్ధికి దోహదం చేస్తూ, మానవునకు కావలసిన శారీరక మానసిక ఆరోగ్యాలకు తోడ్పడటం ఒక మహత్తర విషయం.

వారు సాహితీప్రియులు, సహృదయులు, కవి పండిత పోషకులు అనేక సాహిత్య గోష్ఠులు, ఉత్సాహంతో జరిపించి తాము ఆనందించి, ఇతరులను ఆనందింపజేయడం వారి సాహితీ ప్రయత్నానికి మంచి తార్కాణం.

వారు ఆంధ్రా యూనివర్సిటీ సెనేట్ సభ్యులు. వారిని సిండికేట్ సభ్యత్వానికి పోటీ చేయవలసిందిగా చాలామంది మిత్రులు ప్రోత్సహించారు.

కాని "**మా వీరయ్య నిలబడితే నేనెందుకులెండి"** అని వారు గెల్చే అవకాశం ఉన్నా పోటీ చేయకుండా మానుకున్న ఉదారహృదయులు. తాము సిండికేట్ అభ్యర్థిగా నిలబడక శిష్యుని బలపరచడం సామాన్య విషయం కాదు. వారి శిష్యవాత్సల్యం అట్టిది.

వారికి మేము ప్రథమశిష్యులం కావడం మాకెంతో గర్వకారణం. ఈనాడు వైద్య చికిత్సలో మాకే మాత్రం అభివృద్ధి ఉన్నా దానికి వారే కారకులు. వారితో మా పరిచయం ఈనాటిది కాదు. 30 సంవత్సరాల నుండి కొనసాగుతుంది. ఆనాటి నుండి ఈనాటి వరకు వారి ప్రేమాభిమానాలు చూరగొనడమే గాక వారి కత్యంత సన్నిహితుల్లో ఒకరం గావడం మా అదృష్టం.

ఎందరో శిష్యులకు వారి శక్తివంచన లేకుండా సాయపడి అభివృద్ధిలోనికి తీసికొని వచ్చారు. కోస్తాజిల్లాలలో వారి శిష్యులు, ప్రశిష్యులు లేని ముఖ్యపట్టణం, గ్రామం లేదంటే అతిశయోక్తి కాదు. క్షణం తీరిక లేకపోయినా శిష్యులు కోరిందే తడవుగా ఎంతదూరమైనా వెళ్లి శస్త్రచికిత్సలో సాయపడుతూ అమూల్యమైన సలహాల నిస్తూంటారు.

ఒక వైద్యచికిత్సలో సాయపడడమే కాదు, మా కుటుంబాలలో ఏ శుభకార్యం జరిగినా వచ్చి మాలో ఒకరై, కష్ట సుఖాలలో పాలుపంచుకొని మమ్మానందింపజేయు సదాశివ దంపతులకు మా కృతజ్ఞతాంజలులు.



మనస్సు అతీంద్రియజ్ఞానం

సాహిత్య సమ్రాట్టు, డాక్టర్ త్రిపురనేని వెంకటేశ్వరరావు, యం.బి., బి.యస్.

ప్రపంచ విషయములను మనము జ్ఞానేంద్రియముల ద్వారా తెలిసికొనగలుగుచున్నాము. కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మము ఈ అయిదు జ్ఞానేంద్రియములు వాహనములు మాత్రమే! ఇంద్రియ మెదడు కేంద్రముల ద్వారా కలుగుచున్నది. ప్రపంచానికి మధ్య రాయబారము జరుపునది నాడీ మండలము. ప్రపంచ విషయాలు సంగ్రహించు గూఢచారులు జ్ఞానేంద్రియములు. జ్ఞానేంద్రియములు అందజేయు సాంకేతిక వార్తలు భావనలు లేక యింద్రియానుభూతి అని అందుము. ఈ యింద్రియానుభూతి గ్రాహక కేంద్రముల ద్వారా పెద్ద మెదడు ఉన్నత కేంద్రములు జేరును. ఇచ్చట విశ్లేషణ, సంశ్లేషణ మొదలగు మనోవ్యాపారముల చర్యలకు లోనై అనుభూతి జ్ఞాన మేర్పడును. మెదడు ఉన్నతకేంద్రములు విశ్లేషణ, సంశ్లేషణమే గాక సంకల్పించగలవు, సంతోషించగలవు, విచారించగలవు, పునర్విచారణ చేయగలవు, జ్ఞాపకము చేసికొనగలవు. వాదించగలవు, నిర్ణయించగలవు. దుఃఖించగలవు. మెదడు యొక్క శక్తినే మనస్సు అందురు.

మనస్సునకు, శరీరమునకు అవినాభావ సంబంధము కలదు. అందుచే మనశ్శాస్త్రము శరీర ధర్మశాస్త్రమున నొక భాగము. శరీరధర్మములు మారుట వలన మానసిక స్థితులు మారును. భావనలకు జ్ఞానేంద్రియములు ఆధారములని యింతకు ముందే తెలిసికొని యుంటిమి. జ్ఞానేంద్రియముల అనారోగ్య స్థితులలో కలుగు మానసిక పరివర్తనను కనిపెట్టవచ్చును. మద్యపానము మనఃస్థితిని మార్చును. కొన్ని విషప్రయోగాల వలన, కొన్ని వ్యాధులలో విషపదార్ధములు, రక్తము మిళితమై ప్రసరించుట వలన మనస్సులో సంక్షోభము కలుగును. మెదడులో కొన్ని వ్యాధులయందు రక్తప్రసారము తగ్గినప్పుడు మనోచైతన్యము మారును. జంతువుల మెదడుపై శస్త్ర ప్రయోగములు చేసి మనస్సున కలుగు మార్పులను శాస్త్రజ్ఞులు కనిపెట్టిరి. వేయేల శరీరము లేకున్న మనస్సే లేదు.

శరీర ధర్మశాస్త్రజులు మనశ్శాస్త్రమును పూర్తిగా పరిశోధన జేసి విశాలదృష్టితో విచారించి అనేక ప్రయోగములు జేసి మనస్సు యొక్క స్థానము మెదడేయని నిర్ధారణ

జేసియున్నారు. శిశువునకు మనస్సు ఒకనాడు ఆకస్మికముగా ఉద్భవించినది కాదని, అది క్రమముగా వికాసము చెందినదని శాస్త్రజ్ఞులు నిర్ణయించియున్నారు.

పరిణామవాదియైన డార్విన్ మహాశయుడు జీవపరిణామ సిద్ధాంతమును గూర్చి చెప్పుచూ, మానవుడు శారీరకంగా గాక మానసికంగా కూడ జంతువర్గము నుండి పరిణామము చెందెనన్నాడు.

మెదడు యొక్క ఉన్నతధర్మమునే మనస్సని తెలిసికొంటిమి. మెదడులేనిదే మనోధర్మములు లేవు. అట్టి మనోధర్మాలను గూర్చి సంక్షిప్తముగా తెలిసికొందము.

మనస్సు యొక్క ధర్మములు ముఖ్యముగా మూడు 1. వివేకము/జ్ఞానము 2. భావము 3. ఇచ్ఛ.

వీనిని జ్ఞానభావ సంకల్పములని క్లుప్తీకరించి చెప్పవచ్చును. నాకొక సంగతి తెలియుచున్నది. నాకు కోపము వచ్చుచున్నది. నేనీ పనిని చేయుదును. అను ఈ మూడు వాక్యములలో ఈ మూడు మనోలక్షణములు ఇమిడి యున్నవి.

ఈ మూడు లక్షణములను వ్యక్తపరచునది మానసిక చర్య అనగా చైతన్యము. మానసిక నిర్మాణము వేరు, మానసిక చర్య వేరనియు, శరీరధర్మశాస్త్ర వేత్తలు ఉద్ఘాటించి యున్నారు. మానసిక శాస్త్రచర్యలను నాడీమండల ధర్మములతో సమన్వయము చేసిరి.

మానసిక నిర్మాణము ఒక విద్యుద్ఘటమాల తోడను; చైతన్యము దాని యందలి అంతర్భూతమగు విద్యుత్ శక్తితోను పోల్చనగును. చేతన స్థితులలో తరతమ భేదములు కలవు. నేను కలముతో వ్రాయునపుడు బర బరమను శబ్దము చేయును; అది స్పష్టచైతన్యం. కొంతసేపు వ్రాయుచు; వ్రాతయందే ధ్యానముంచుటచేత ఆ ధ్వనిని గుర్తింపము, అది అస్పష్టచేతన స్థితి. మన శరీర వ్యాపారమున; హృదయచలనము ప్రేగుల కదలిక ; మనము గ్రహింపరాని అస్పష్టచేతనములే. జ్ఞానేంద్రియములకు మెదడుకు, మనస్సుకు ధర్మ శాస్త్రాలకు, నియమములున్న అటువంటి సంబంధము లేని, నియమములు కూడ కొన్ని యున్నవని కొంతమంది అభిప్రాయము. ఒక వస్తువును చూచుటకు ఒక శబ్దమును వినుటకు జ్ఞానేంద్రియముల సహాయము చూడవచ్చును; వినవచ్చును. అట్లు జరుగుటకు మానవునిలో ప్రత్యేక శక్తి యున్నదని దానిని ఆరవ యింద్రియమని కొందరు నామకరణము చేసిరి.

ఈ ఆరవ యింద్రియము ద్వారా జరుగు ప్రక్రియను అతీంద్రియశక్తి లేక అతీంద్రియ గ్రహణ అందురు. అతీంద్రియశక్తిని గ్రహించి ఆరవ యింద్రియము మానవుని శరీరములో ఎచ్చట నున్నదో వీరు చెప్పరు. ఇంద్రియానుభూతి కొన్ని హద్దులకు అనగా కాలము మీద; దేశము మీద ఆధారపడి యుండును. కాని అతీంద్రియ శక్తి కాలమునకు, స్థలమునకు, దేశమునకు లోబడని అతీతశక్తి యనియు వీరి అభిప్రాయము. ఈ ఆరవ యింద్రియము, ఎంత దూరమైన చూడగలదు. ఎంత దూరమైన వినగలదు. ఇది కాలమునకు, దూరమునకు ప్రపంచముకున అవతలనున్న విషయమును గ్రహింపగల అద్భుతశక్తియని వీరి నిర్వచనము.

ఇది కేవలము భ్రమ. ఒకటి వాస్తవం. రెండవది అవాస్తవమైనది. వాస్తవమైనది. జ్ఞానేంద్రియములకు మెదడునకు సంబంధించినది. అవాస్తవమైనది. అనారోగ్యముగా నున్న మెదడునకు సంక్షోభములోనున్న మనస్సుకు సంబంధించినది. జ్ఞానేంద్రియములు, మెదడు అనారోగ్యముగా నున్నప్పుడు కొన్ని భ్రమలు కలుగును. ఆ భ్రమలనే అతీంద్రియ జ్ఞానమని కొందరు వర్ణించుచున్నారు. ఇది ఒక భ్రమ.

దూరముగానున్న రైలు పట్టాలను చూచినప్పుడు అవి రెండునూ కలసి కొనినట్లు కనబడును. ఎండాకాలములో ఎడారిలో దూరములో మంచినీరు ఉన్నట్లు కనబడును. అవియే ఎండమావులు. ఇవి నయనేంద్రియ భ్రమలు. ఉసిరికాయ తిన్న తరువాత మంచి నీరు త్రాగిన తియ్యగా నుండును. వీపు మీద సన్నగా చెక్కిన రెండు పెన్సిళ్లు అతి సమీపములో నుంచిన ఒకటిగా భ్రమకలుగును. ఇది చర్మేంద్రియ భ్రమ. ఈ విధముగా జ్ఞానేంద్రియములు ఆరోగ్యముగా నున్నప్పుడు కూడ కొన్ని కలుగును. వీనినే వాస్తవిక భ్రమలు అందురు.

భావోద్రేకములు భ్రాంతి జనకములు. భయభ్రాంతుడు తాడును చూచి పాము అనుకొనును. దీనినే **'రజ్జు సర్ప భ్రాంతి'** అందురు. శ్మశానములో దయ్యములుండును; భూతనాధుడైన శివుడు శ్మశానములో తాండవించును ఆను పుక్కిటి పురాణములను నమ్మువాడు చీకటిలో శ్మశానములో పొదను చూచిన దయ్యమనుకొనును.

కొందరు తమనీడను చూచి దయ్యమని భ్రమపడుదురు. ఇవి అన్నియు మనస్సు బలహీనముగా నున్నప్పుడును, అనారోగ్యముగా నున్నప్పుడును జరుగు భ్రమలు, ప్రమాదములు.

జ్ఞానేంద్రియములకు రోగములందును, శరీరము పూర్తిగా అలసినప్పుడు, నిద్రయందు, కొన్ని మత్తుమందులు సేవించినపుడు, విపరీతములైన అనుభూతులు కలుగును. నేత్రనాడీ రుగ్మతయందు మెదడు నందలి దృష్టి కేంద్ర ముద్రిక్తమైనచో పెద్దజ్యోతి మండలము కనపడును. దానికి దయ్యమనియో దేవతనియో అతీతమానవశక్తి యనియో విశ్వసించి ప్రమాదకరములగు యోచనలకు వెనుదీయని భ్రాంతిమతులు కలరు. మతావేశము కలవారికి సులభముగా భ్రాంతి కలుగును, భ్రమ (illusion) అనగా ఒక దానిని చూచి వేరొకటి యనుకొనుట. అనగా తాడునుచూచి పామనుకొనుట. అసలు లేని దానిని ఉన్నదనుకొనుట ఇంద్రజాలకము (Hallucination).

ఈ ఇంద్రజాలకము నాల్గు రకములు 1. భౌతికము 2. రసాయనకము. 3. జీవము. 4. మానసికము. భౌతికపదార్ధముల వల్ల కలుగు ఇంద్రజాలకము భౌతికము. కొంతమంది భౌతిక శాస్త్రజ్ఞులు మెదడులోని సూక్ష్మ కణజాలమును విద్యుత్ శక్తి ద్వారా ఉద్దీపింపజేసి; దయ, కరుణ: ప్రేమ, క్రూరత్వము, శత్రుత్వము, ఆకలి, సంక్షోభము, భయము మొదలగు వికారములను కలుగజేసిరి. మనమేదైన భయంకర దృశ్యమును చూచినపుడు భయము కలిగి, శరీరము వణకును. చెమటలు పట్టును, నాడి బలహీన మగును. ఏదైన ఒక మనోహర దృశ్యము చూచినపుడు ఆనందము కలుగును. ఒక జుగుప్సాకరమైన దృశ్యము చూచినపుడు శరీరము గగుర్పొడుచును. ఇవియన్నియు భౌతికమునకు సంబంధించినవి. లయబద్దమైన శబ్దములు, బిందునాదము, డప్పుల మ్రోతలు, బ్యాండు మేళాల ధ్వనులు విన్నప్పుడు భావోద్రేకము కల్గును. గంగానమ్మకు, పోలేరమ్మకు మ్రొక్కునప్పుడు చేయు లయబద్ధమైన శబ్దములకు వీరావేశము కలిగి మానవులను ఉన్మాదస్థితిలోనికి తీసికొనిపోయి వారిచే వెర్రిచేష్టలను చేయించును. మంత్రోచ్చారణ, దుందుభిధ్వనులకు; లయబద్ధమైన పాటలకు ఒళ్ళు పెరిగి పిచ్చివారివలె అమ్మవారిభక్తులు దేవాలయములలో ప్రవర్తించుట మనము కనులార చూచుచుండుట లేదా!

ఇక రసాయన పదార్థముల విషయము వేరే చెప్పనక్కర లేదు. కల్లు, సారాయి, విస్కీ, బ్రాంది. భంగ్; నల్లమందు, గంజాయి మొదలైన మత్తుపదార్థములు సేవించునపుడు అనేక విచిత్రానుభూతులు కలుగును.

ఇక జీవపదార్థ సంబంధమైన కారణములను పరిశీలన చేయుదము. కొన్ని అంతర్ద్రవములు లోపించినపుడు. విటమిన్సు లోపించినపుడు; జీవితావసర పదార్థములైన ఇనుము తుత్తునాగము: రాగి; కాల్షియమ్ మొదలైనవి లోపించినపుడు మతిభ్రమణము కలుగును. పెలాగ్రా అను వ్యాధిలోని కటానీక్ లోపించుట వల్ల మతిభ్రమణము కలుగును. పెరా థైరాడు సరిగా పని చేయకపోయినచో మతి భ్రమణము కల్గును.

మానసికమును గూర్చి వేరే చెప్పనక్కర లేదు. మనకు ప్రియమైన బంధువులు, స్నేహితులు మరణించినపుడు మనసు చాలసంక్షోభము చెందును. మానసిక బలహీనత కలిగిన వ్యక్తులకు దయ్యము ఆవరించినట్లు కనబడును. ఇదే మతిభ్రమణము. ఈ వ్యాధిని **"గ్లోసో వేరియా"** అందురు. ఈ దయ్యమును పారద్రోలుటకు ఆ రోగిని దారుణముగా కొట్టి హింసించెదరు. నిజమునకు అచ్చట దయ్యము లేదు. భూతము లేదు. అది ఒకమానసిక సంక్షోభము, అదే మానసిక వ్యాధి.

ఇదే విధముగా విషయేంద్రియ పరిజ్ఞానముపై చిన్నతనము నుండి మాయాప్రభావము మనుజులపై చాల ఉండును. నల్లపిల్లి ఎదురువచ్చిన అశుభ సూచకము. ఒంటి బ్రాహ్మణుడు ఎదురు వచ్చిన అమంగళ సూచకము. 13 వ నంబరు చెడు నంబరుగా భావించుట, జ్యోతిషము ఆధారముగా భవిష్యత్తును ఊహించుట మొదలైన వన్నియు మానసిక బలహీనతకు సంబంధించిన భ్రమ ప్రమాదములు. దేవతల; భూతముల స్వర్గ, నరకముల పునర్జన్మల ఆలోచనలు మాయ ప్రభావమునకు లోనైన మానసిక భ్రమలు. ఇట్లు అతీంద్రియజ్ఞానము మానసిక భ్రమలకు సంబంధించినదే కాని వాస్తవమైనది కాదు.



నిజమైన స్నేహితులు

శ్రీ దరువూరి వీరయ్య

''అరుదుగా తప్ప లభించని వాటికే ప్రపంచంలో విలువ. బంగారం అరుదైనది, ప్లాటినం మరింత అరుదైనది. యురేనియం ఇంకా అరుదు. అందుకే వాటి కంతవిలువ.

కాని జీవితంలో అన్నిటికంటే అరుదైనవి కల్తీ లేని చిరునవ్వు, కల్మషంలేని మాట, కష్ట కాలంలో చేయూత, కలకాలం నిలచే మైత్రి, అవి సమకూరినప్పుడు కలిగే సంతోషానికి ఖరీదు కట్టడం ఏ షరాబుతరం!

జీవితం గడుస్తున్నకొలది పాతమిత్రులు పోతూవుంటారు, కొత్తమిత్రులు వస్తూ వుంటారు. కాని పాత మిత్రులను మరచిపోకుండా తమ అంతస్తు పెరిగినా ఆప్యాయత మాత్రం తరగకుండా నిలుపుకోగల వారెందరుంటారు!

కుచేలుడు, శ్రీకృష్ణుడువలె ద్రోణుడు, ద్రుపదుడు కూడా చిన్ననాటి సహాధ్యాయులే. అయినా తనవద్దకు భిక్షార్థియై వచ్చిన కుచేలుడిని శ్రీకృష్ణుడు ఆదరిస్తాడు. ద్రోణుని ద్రుపదుడు నిరాదరిస్తాడు! జీవితంలో వారూ వుంటారు, వీరూ వుంటారు. ఎటొచ్చీ మొదటివారు అరుదుగా వుంటారు. అందుకే వారికా విలువ" - శ్రీనార్ల

శ్రీనార్ల వారన్నట్లు జీవితంలో అనేక రంగాల నుండి, అనేక రంగాలనుండి అనేక రకాలుగా మిత్రులుగా లభిస్తుంటారు. జీవితం గడుస్తున్నకొలది పాతమిత్రులు మరచి పోకుండా, తమ అంతస్తు పెరిగినా, తరిగినా ఆదరణ, ఆప్యాయత, గౌరవమర్యాదలు తరగకుండా నిలుపుకోగల వారెందరుంటారు? పరస్పరం ఒకరినొకరు దగ్గర చేసుకొంటూ, పొరపొచ్చెములు వచ్చినా ముఖాముఖి చర్చించుకొని, అపార్థములను తొలగించుకొని జీవితాంతం వరకు మిత్రులుగా వుండడం ఉభయుల సద్భావం, చిత్తశుద్ధి, నైతిక విలువలు, అన్నిటికంటే, ఎదుటివారికి కూడా కొన్ని నిశ్చిత అభిప్రాయాలుంటాయని, ఉండడం న్యాయమని, అది సృష్టి నైజమని అర్థం చేసుకొనడం మీదనే శాశ్వతమైత్రి ఆధారపడి వుంటుంది.

డాక్టరు కాసరనేని సదాశివరావుగారు "నిజమైన మిత్రులుగా, పై సూక్తులు ఆధారంగా నేను నిర్ణయించుకొన్నాను. శ్రీ సదాశివరావు దంపతులు గుంటూరులో వైద్యశాల పేరుతో ప్రజా ప్రైవేటు ప్రాక్టీసు ప్రారంభించి, ఇరవై అయిదు సంవత్సరాలు నిండాయి.

వారితో నా మైత్రికి కూడ ఇరవైఅయిదు సంవత్సరాలు నిండాయి. ఈ ఇరవై అయిదేండ్ల సుదీర్ఘకాలంలో మేము నిజమైన మితులుగా జీవితం గడిపాము. అయితే పాతమిత్రులను సమాజంలో తమ అంతస్తు పెరిగినా మరచిపోని సౌమనస్యం, సౌహార్ధతలు గల నిజమైన మిత్రులుగా శ్రీసదాశివరావు నాటికీ నేటికీ నిలచారు.

డాక్టరు సదాశివరావు దంపతులు మెడికల్ ప్రాక్టీసు ప్రారంభించి ఇరవై అయిదు సంవత్సరాలు నిండిన సందర్భం పురస్కరించుకొని ఇంతకాలంగా తమ వద్ద వైద్యశిక్షణ పొంది, వైద్యశిక్షణతో పాటు క్రమశిక్షణ, కష్టపడి పని చేయడం, ప్రభుత్వోద్యోగాలతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా జీవితం గడపగల ఆత్మవిశ్వాసం అలవర్చుకొని, గుంటూరు, కృష్ణ, ప్రకాశం జిల్లాలలో దాదాపు ప్రతి ఫిర్కా, తాలూకా కేంద్రములలో ప్రైవేటు వైద్యాలయాలు నిర్మించుకొని, విజయవంతంగా నిర్వహించుకొంటున్న వందలాది శిష్యగణం, వారితోపాటు మిత్రులు, అభిమానులు రజతోత్సవం జరపాలని నిర్ణయించు కొనడం జరిగింది.

ఈ సందర్భంగా మా ఇరువురికి గల సత్సంబంధాలు, కొన్ని మధురస్మృతులు పేర్కొనడం అనుచితం కాదనుకొంటాను.

శ్రీ సదాశివరావు గారి మేనమామ, స్వాతంత్ర్య సమరయోధుడు. దేశభక్తుడు ప్రజాసేవా తత్పరతగలవ్యక్తి అన్నింటినీ మించి ఉదారహృదయుడునైన కీర్తిశేషులు శ్రీ పిన్నమనేని సూరయ్య చౌదరి గారు. వారి సన్నిహిత మిత్రులు కీర్తిశేషులు శ్రీ ఘంటా శేషయ్య, శ్రీ సింగం పుల్లారెడ్డి గారూ, నేనూ అప్పట్లో స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రోద్యమ రథసారధి. ప్రజాసేవాభిలాషియునైన శ్రీ జి.వి. పున్నయ్య శాస్త్రి గారి నాయకత్వాన 1942 ఆగష్టు స్వాతంత్ర్యసమరములో ముమ్మరంగా కలసి పనిచేశాము. ఆ సందర్భంలో అప్పుడప్పుడు శ్రీ సదాశివరావు గారిని గురించిన ప్రస్తావన మా మధ్యన జరుగుతుండేది. చదువులలో శ్రద్ధ, పట్టుదల, మంచి నడవడి విశాల హృదయం, కష్టించి పనిచేసే ప్రపత్తి గల యువకుడని ప్రశంసిస్తుండేవారు. ఒక మారు L. V. R. క్లబ్లో శ్రీ పుల్లా రెడ్డి నాకు శ్రీసదాశివరావును పరిచయం చేశారు. అయినా తరువాత మేమెన్నడూ కలవలేదు. కొన్నాళ్లకు M.S. గోల్డు మెడల్ తో ఉత్తీర్ణుడు అయినప్పుడు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా వున్న శ్రీ కందుల ఓబుల రెడ్డిగారు తరచు శ్రీ సదాశివరావుగారిని గురించి చెపుతూ 'మంచి మిత్రుడు, ఉత్తమాదర్శాలుగల వ్యక్తి, సంఘ సంస్కరణాభిలాషి. కట్నంతో నిమిత్తం లేకుండా శ్రీమతి జయప్రదాంబను వివాహం చేసుకొన్నారని బహుగా

ప్రశంసిస్తూండేవారు. శ్రీ ఓబులరెడ్డి గారు కూడా నాటికీ, నేటికీ, ఎన్ని రాజకీయ విభేదాలున్నా శ్రీ సదాశివరావు గారికి నిజమైన మిత్రులుగానే కొనసాగుతున్నారు.

గుంటూరులో ప్రజావైద్యశాల ప్రారంభసమయంలో నేను కారణాంతరముల వలన హాజరు కాలేకపోయినా నెల తిరగకుండానే, నా కత్యంత ప్రేమపాత్రుడు, సన్నిహిత మిత్రుడునైన శ్రీ.బి.యస్. ఆర్. కృష్ణ క్షయవ్యాధికి గురికాగా శ్రీసదాశివరావుగారివద్ద వైద్యం చేయించడం జరిగింది. అప్పుడు మేమిరువురం ప్రతినిత్యం కలుసుకోవడం, అనేక విషయాలు చర్చించి కొనడం ద్వారా సన్నిహితులమైనాం. అదే సమయంలో నాకు జబ్బు చేసింది. గుండెల్లో నెమ్ము, దగ్గు, జలుబు, జ్వరం. ఎంత వైద్యం చేసినా వారాల పర్యంతం తగ్గక బాధపడుతుంటే బాల్యమిత్రులు, సన్నిహితులు, బంధువులు చాలా మంది బి. యస్. ఆర్. తో కలసి వుండడం వలన నాకు ఈ వ్యాధి సోకిందని హెచ్చరించి, దూరంగా వుండమని సలహాయిచ్చారు. అయినా మిత్రుని విడచి దూరంగా వుండలేకపోయాను. అయితే నిజంగా క్షయవ్యాధేమోనని అనుమానం నాకు కలిగి డాక్టరుగారిని మాటవరుసకు అడిగాను. ఆయన చిరునవ్వుతో మీకేమి జబ్బు నాకు తెలుసు. అయినా శంక తీర్చాలి గదా! అంటూ "**ఎక్సరే**" చీటి వ్రాసియిచ్చారు. ఫోటోతీయించాను. కొన్ని విషయాలలో నేనూ పిరికివాడినే. అందువలన స్వయంగా వెళ్లక ఫొటో పంపించగా. అదిచూచి భయంలేదు రమ్మని కబురంపాడు. నేను కలిశాను, అనుమానం ''బ్రొంకైటీసు''. రహితమైంది గదా! అన్నారు. నా యీవిషయం ఎందుకు ప్రస్తావించానంటే ఒకటి మా మధ్య సన్నిహితత్వాన్ని తెల్పడానికి; రెండు రోగిపడే బాధ ఆందోళనలో పాలుపంచుకొంటూనే, రోగిని ఆందోళన చెందనీయక, గాభరా పెట్టక, ధైర్యం కలిగించడం ఆయన విశిష్ట లక్షణం అని చెప్పడానికి.

శ్రీసదాశివరావుగారివలె బి.యస్. ఆర్ కృష్ణ కూడా ఆర్ధికంగా, పదవిరీత్యా అత్యున్నతస్థితిలో వున్నా మామధ్య ద్రోణుడు, ద్రుపదుడువలె గాక, కుచేలుడు, కృష్ణుడు నిజమైన మిత్రులంగానే వున్నాము.

మిత్రులకు ప్రోత్సాహం

శ్రీసదాశివరావు గారివద్ద వందలసంఖ్యలో ఈ ఇరవై అయిదు సంవత్సరాలలో శిక్షణ పొందిన డాక్టర్లున్నారు. వారిలో 90 శాతం దాకా ప్రభుత్వోద్యోగాలకు ఎగబడక, స్వతంత్రంగా ఆయా ప్రాంతాలలో వైద్యశాలలను ప్రారంభించి ఉన్నతదశలో వున్నారు. ఇందులో నేడు గుంటూరు లీడింగ్ ప్రాక్టీషనరుగా దినదినాభివృద్ధి చెందుచున్న మిత్రులొకరు డాక్టరు దంపతుల వద్ద శిక్షణ పొందిన తరువాత గుంటూరులో నర్సింగ్ హోమ్ పెట్టి, ఇంతమంది డాక్టర్లున్న జిల్లా కేంద్రములో నిలబడగలనా! అనే సందేహము

వెలిబుచ్చగా ఆయనకు ధైర్యం చెప్పి, పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసం వుంటే ప్రాక్టీసు దానంతట అదే అభివృద్ధి చెందుతుందన్నారు. అలానే మిగతావారందరిని ప్రోత్సహించాడు.

డాక్టరు గారు : గుంటూరు, ప్రకాశం, కృష్ణాజిల్లాలలో గల తనవద్ద శిక్షణ పొందిన డాక్టర్లు తమలో తాము మాట్లాడుకొనే సందర్భంలో శ్రీసదాశివరావు గారిని ఒక్కరినే డాక్టరు గారు, మాష్టరు గారు అని సంబోధించుకొంటుంటారు. డాక్టరుగారు వస్తున్నారన్నా డాక్టరుగారు కబురుపెట్టారన్నా, సదాశివరావుగారేనన్న అభిప్రాయం సర్వేసర్వత్రా కలుగుతుంది.

శ్రీమతి జయప్రదాంబ గారిని గురించిన ఒక మాటతో యీ నా రచనముగించడం విద్యుక్తధర్మంగా భావిస్తాను. డాక్టరు జయప్రదాంబగారు ఏ పని చేసినా చేతలలోనే గాని మాటలలో గాదు. తక్కువ మాటలు, హెచ్చు కృషి ఆమె ప్రకృతి. ప్రజావైద్యశాల అభివృద్ధికి, వందలాది శిష్యగణం యొక్క స్నేహసౌశీల్యాలకు శ్రీమతి జయప్రదాంబ ప్రేమాభిమానాలు నిరాడంబరమైన, ఆదర్శవంతమైన కృషి ప్రధాన కారణాలు.

"మనుషులు డబ్బును గురించి మాట్లాడుతారు. డబ్బు ఉపయోగకరమైనదే, ఆ విషయంలో సందేహము లేదు ఆఖరికి లెక్కలోనికి వచ్చేది మనిషి. చరిత్రను సృజించిందీ, మానవ పురోభివృద్ధికి తోడ్పినదీ మనుషులే, డబ్బు కాదు". - పండిట్ నెహ్రూ

భారతజాతి నేత. మన ప్రియతమనాయకుడు పండిట్ నెహ్రూ సూక్తిని అక్షరాల పాటించే ఉదాత్తలక్షణం డాక్టరు సదాశివరావు దంపతులు అలవర్చుకొన్నారనడం అతిశయోక్తి కాదు.

సంపాదలనలో గొప్పది : **"సంపాదనలన్నింటిలో స్నేహాల సంపాదన గొప్పది. అది తరగని ఆస్తి. పంచుకొన్నకొద్దీ పెరిగే ఆస్తి. అసూయా ద్వేషాలను విరిచివేయ గల ఆస్తి"** – శ్రీ నార్ల.

అక్షరాక్షతలు

చిన్నము రామయ్య చౌదరి

1. కొందఱు భావుకుండనియు, కొందఱు మరచి రసజ్ఞుఁడంచు వా
కొందురు, వైద్యలోకమునకున్ తలమానిక మందు రందఱున్
ఎందఱో "సాహితీప్రియుఁడఁటే" యని కన్నుల కద్దుకొందురీ
చందము లన్ని నీహృదయ సంస్కృతి కెత్తు పతాకలే కదా!

2. కుల మత వర్గ భేదములకున్ గుఱి కాని పవిత్రభావనా
విలసితమైన మీహృదయ వేదము మేము పఠించినాము, మం
జులకవితా ఝరీ మధుర సుందర కావ్యమరంద బిందువుల్
వలచెడి మీకు నా హృదయవాణిని కాన్కగ నిచ్చి మెచ్చెదన్.

3. ఉన్నత విగ్రహమ్మునకు సుద్దిగ దిద్దిన యట్టులై, ప్రస
న్నోన్నత ఫాలపట్టిక, సమున్నతనాస, విశాల నేత్రముల్
తిన్నని మేనితోడ సముదీర్ణపు టంగము లద్దినట్లు నీ
ప్రన్నని మూర్తి మా కనుల పండువుగా వెలుఁగుల్ వెలార్చెడిన్.

4. ధరణిన్ శస్త్రచికిత్సయందు నిపుణుల్ తారన్న ప్రఖ్యాతి కొం
దఱకబ్బున్ మఱి రోగనిర్ణయవిధానమ్మందు సత్కీర్తి కొం
దఱకే లభ్యము, రెండుపద్ధతుల లోనన్ సిద్ధహస్తుండవన్
బిరుద మ్మందితిఁ ప్రజ్ఞ లెప్పుడును పృథ్విన్ కీర్తికిన్ పాత్రముల్.

5. అమ్మ జయప్రదా! విశద మయ్యెను నీ ప్రతిభావిశేష సా
రమ్మగు వైద్య పద్ధతియు, శ్రద్ధయు, సర్వజనాళికిన్ ప్రమో
దమ్ము నొసంగె నీదు జనతా సమతత్వము, వైద్యశాల స
ర్వమ్మును దిద్దితీర్చితి శివత్వమహత్తు చెలంగునట్లుగా.

6. ఒక మిత్రుని పుత్రిక విం
కొక మిత్రుని పత్ని వనుచు, నుభయవిధములన్
పెకలించితి బంధుత్వము

బంధుత్వము నొక గుణసంపదకె మనసు లొఁఅగొను వశమై.

7. చిర్నగవు తోడి మొగమున సిరులు చింద
కుందనపు మేని చాయ హంగులు వెలార్ప
నిండు కుండ నడతెంచు నిన్నుఁ జూడ
మంచి యిల్లాంఢ్ర కోవ కన్పించు నమ్మ.

8. మీ ప్రజావైద్యశాల జయప్రదమయి
దేవుఁడిచ్చిన వరముగా తేజరిల్ల
ప్రజల కెల్ల సదాశివత్వము లభించే
దంపతులు మీరు గనుఁడు శాశ్వతయశస్సు.

9. మీరలు వృత్తి ధర్మము నుమించి ఫలించిన వైద్య శేఖరుల్
ఆఅనివ్యాధి మీ యమృతహస్తము సోకిన రూపుమాయు న
న్నారు సుమా ప్రజల్, ప్రజల నాల్కలు స్వేచ్ఛకు మూల కందముల్
ఈ రజతోత్సవమ్మొక మహేష్టము మీగురు వైద్య విద్యకున్.

10. పదిమాటల్ పలుకంగ నేమిటికి? మీ ప్రాసాదమే సాహితీ
సదన మ్మయ్యెను, వైద్యపట్టములు సంసారంబు సర్వంబు నిం
పొదవన్ నిండుకొనెన్, కళాలయములన్ బ్రోక్షించి పాలించుటల్
చదురున్ గూర్చె, త్వదీయవృత్తి కగుతన్ స్వర్ణోత్సవప్రాప్తియున్.

11. పట్టణమ్మున ప్రథమదంపతులు, వైద్య
పట్టభద్రుల మీరన్న ప్రథయ కాక
వృత్తికే గొప్ప పేరు సృష్టించినార
లాదికవు లట్లు, దీర్ఘాయు వగుత మీకు.

ప్రజా వైద్యులు

- శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

''కొందరు ఆశలకై బ్రతుకుతారు. కొందరు ఆశయాలకై జీవిస్తారు.'' కాసరనేని సదాశివరావు సుమారు 55 యేళ్ళ క్రితము గుంటూరుజిల్లా తక్కెళ్ళపాడు శివారు రామచంద్రపాలెంలో పుట్టి గుంటూరులో ఉన్నతవిద్య పూర్తి చేసి, విశాఖపట్నములో శస్త్రవిద్యలో M.S. డిగ్రీ తీసుకొని కొంతకాలము గవర్నమెంటు హాస్పిటల్లో పనిచేశారు.

వీరి తాత పిన్నమనేని వీరయ్యగారు వీరిని పెంచి పెద్దవారిని చేశారు.

కవివర్మగా ప్రసిద్ధిగాంచిన చలసాని లక్ష్మీనారాయణ గారి కుమార్తె డా॥ జయప్రద గారిని, డాక్టరు సదాశివరావు గారు కట్నకానుకలు తీసుకోకుండా 1949 లో పరిణయ మాడారు. వారిద్దరు వైద్యులగుట వలన వారి జీవితాలు అన్నివిధాల అభివృద్ధి దాయకముగా ఉన్నవి.

ఈ దంపతులిరువురు 1951లో గుంటూరులో "**పీపుల్సు నర్సింగ్ హోమ్**" స్థాపించారు. వైద్యవృత్తి చాలా ఉత్తమమైనది. వీరిరువురు అధికముగా ప్రాణాలు రక్షించే వైద్య శిఖామణులు:

వీరి ఆస్పత్రిభవనము పేరు **'జీవని'**. నిజముగా ఇది సార్ధకనామము: వైద్యుడు లేని ఊరిలో ఉండవద్దని సుమతీ శతకకారుడేనాడో అన్నాడు.

గుంటూరు గొప్పబస్తీయే కాదు, ఎన్నో విధాల గొప్పది గుంటూరు జిల్లా. ఆంధ్రప్రదేశ్ లో విద్యలో ప్రాముఖ్యమైనది. విద్యలోనే కాదు రాజకీయరంగములో, వైద్యములో విఖ్యాతి గాంచినది. ఇక్కడ ఈనాడు ప్రభుత్వపు గొప్ప ఆసుపత్రి కలదు. వివిధ శాఖలలో ప్రఖ్యాత వైద్యనిపుణులు కూడ ఉన్నారు. ఇంకా అనేక ప్రైవేటు డాక్టర్లు కూడ కలరు. ఇటువంటి పరిస్థితుల్లో 'పీపుల్సు నర్సింగ్ హోమ్' **రజతోత్సవము** జరపటం ముదావహము.

దీనికి ఇరువది ఐదు సంవత్సరాల వయసు కలదు అంటే వారెంతో నిపుణత్వము సంపాదించారన్నమాట.

ఈ డాక్టర్లు దయాదాక్షిణ్యాలు కలవారని, అమృతహస్తులని, ఉన్నవారు, లేనివారు అని కూడ చూడక, ఈ నర్సింగ్ హోమ్ కు అసంఖ్యాకంగా రావటము నేను ఎరుగుదును. ఐనా ఇందులోనే వీరు సరిపెట్టుకొనక ఇతర కార్యక్రమాలలో కూడా పాల్గొంటున్నారు.

కల్పశాఖి

పంచాగ్నుల లక్ష్మీనారాయణ

‘‘**చిత్తశుద్ధి కలిగి చేసిన పుణ్యంబు...**’’ అంటాడు. వేమన ఒక చోట. ఆసుపత్రి అక్షరాల 'ప్రజా వైద్యశాల' అనే పేరుతో శ్రీయుతులు డాక్టరు సదాశివరావు, జయప్రదాదేవి పుణ్యదంపతులు సుమారు ఇరువది ఐదు సంవత్సరముల కిందట సాంబశివపేటలో నెలకొల్పిన ఈ చిరుసంస్థకే సార్ధకమైనది. తదుపరి **1861లో** ఈ గృహమును వీరు చేపట్టునప్పటికి, ఈ ప్రాంతము చెప్పుకోదగినంత జన సంచారము వుండెడిది కాదు. (ఇప్పుడు ఎల్లర దృక్కులను ఆకర్షించుచున్న ప్రజా వైద్యశాల ఉన్నచోట, ఒక వైద్య గృహము నామ మాత్రముగ నుండెడిది.) శ్రీయుతులగు; డా. సదాశివరావు దంపతులు, దానిని కొని, దానిలో తమ అభిరుచికి తగినట్లు **'ప్రజావైద్యశాల'** స్థాపించి నడుపుట జరిగెను. అప్పటి నుండి ఈ సంస్థ “**ఇంతింతై వటుడింతయై**" అనినట్లుగా, దినదిన ప్రవర్ధ మానమగుచు, నేటికి రజతోత్సవము నొనర్చుకొను ప్రాయమును సంతరించుకొనెను.

అసలు ఒక్కొక్క వ్యక్తి జీవితములో, కొన్ని శుభఘడియలు, అప్రయత్నముగా దైవవశమున తటస్థపడుచుండును. అట్టివే, చిరంజీవులు, డా.సదాశివరావు, డా.జయప్రదా దేవి తమ గ్రహణ మహోత్సవము ద్వారా పొందిన అమూల్యములగు శుభఘడియలు, అవే వారి జీవితములో ఒక మలుపును త్రిప్పి, పురోభివృద్ధికి సోపానములను నిర్మించినవి.

అప్పటికి డా. సదాశివరావును గురించి అప్పటి గుంటూరు హిందూ కాలేజి ప్రిన్సిపాలు, వీరిని తీర్చిదిద్దిన ఆధ్యాపకులు, కీ. శే. బుద్ధిరాజు రామచంద్రరావు పంతులు గారు; ఆనాటి విశ్వవిద్యాలయపు వైద్యకళాశాలలో వీరి సహచరులు అగు తోడి వైద్యవిద్యార్ధి బృందము సందర్భవశమున వీరిని గురించి ప్రశంసించుట వినుచుండుట జరిగెడిది.

చేతి వలన కంకణమునకే వన్నె హెచ్చినదో, కంకణము వలన, కరమునకే శోభ కలిగిందో చెప్పజాలనట్లుగా;

చి. సౌ. జయప్రదాదేవి సహచర్యము వలన సదాశివరావే అదృష్టవంతుడైనాడో, లేక డా. సదాశివరావును చెట్టబట్టుట వలన ధర్మపత్నియే మెప్పులను పొందెనో వారికే తెలియదన్నచో అబ్బురముగాదు.

భారత సేవక సమాజపక్షాన కుటుంబ నియంత్రణ, శరీర వ్యాయామము మొదలైన ఆరోగ్య విషయాలమీద కూడ కృషిచేస్తూ వచ్చారు. నేను సదాశివరావు గారు 1967 నుంచి నడుపుతున్న సాహితీ సదస్సును, దాని విశిష్ట సభ్యులను పురస్కరించుకుని వ్రాస్తున్నాను.

అతిథి మర్యాదలకు ఈ దంపతులు పెట్టినది పేరు. చిన్నా, పెద్ద, కొత్త, పాత తేడాలు లేకుండా అందరినీ ఒక్కలాగే ఆదరించి గౌరవిస్తారు.

ఈ డాక్టరు జయప్రదగారిని గురించి నాకు తెలిసినది ఒకటే విషయము. వీరికి వంటమనిషి వున్నాడు. ఐనా ఆమె డాక్టరు సదాశివరావు గారితో కూర్చుండక వడ్డన చేస్తూవుంటే ఈమె డాక్టరు అని ఎవ్వరూ అనుకోరు. మర్యాద, మన్నన ఈమె సొత్తు. సాహితీ సదస్సుకు వచ్చినప్పుడు నేను ఎప్పుడూ వీరింట్లోనే వుంటాను.

నేను దీనిలో డాక్టరు సదాశివరావుగారి గురించే వ్రాస్తున్నాను. ఆయనను గురించి చదివాను, తెలుసుకున్నాను.

డాక్టరు సదాశివరావుగారు 1962 నుండి గుంటూరు మెడికల్ కాలేజీలో ప్రొఫెసరు, గవర్నమెంటు ఆసుపత్రిలో ఆనరరీ సర్జను. గుంటూరు సావనీరు క్లబ్ ప్రెసిడెంట్ వంటి ఎన్నోవిధాల ప్రజాసేవచేస్తూ అందరి మన్ననలను అందుకుంటున్నారు. లేకపోతే, వీరు స్థాపించిన పీపుల్స్ హోమ్‌కు ఇంత మంది డాక్టరులు కూడి రజతోత్సవము చేయటము ఎందుకు!?

డాక్టరు సదాశివరావు గారు డాక్టరు గానే కాక వ్యక్తిగా కూడా ఉత్తమమానవుడు. ఇంతేగాదు ఆయన ఉత్తమ మానవతావాది కూడా. ఇది ఆయన మాటల్లో, పనులలో అన్నింటా చూస్తాము. చాలామంది పెద్దలు తాము చెప్పటమే కాని ఇతరులు చెప్పేది వినరు. సదాశివరావు గారు అలాకాదు. ఎవరు చెప్పినా సరే ఓపికగా విని ''మంచి ఉంటే నేర్చుకోవటానికి వెనుకాడరు!'' ఒక్కమాటలో చెప్పాలంటే సదాశివరావు గారు సంపూర్ణ మానవుడు.

ఈ పీపుల్స్ నర్సింగుహోమ్ ఇతోధికంగా పనిచేసి, ఇంకా అధిక ప్రజాసేవ చేసి ప్రజల మన్ననలను పొందుగాక!

ఏ కారణం చేతనైనా వ్యాధివస్తే వైద్యుని యెడల రోగియెలా ప్రవర్తించాలో, వైద్యుడెలా వుండాలో కూడ తెలుపటం మంచిదని యెంచుతాను.

ఎందుచేతనంటే డాక్టరుకు రోగికి గల మానవసంబంధాన్ని బట్టే రోగాలు కుదురుతాయి.

The relationship between doctor and patient is extremely helpful both physically and phychologically. You cannot get man physically healthy until you get him spiritually healthy.

డాక్టరు దయాదాక్షిణ్యములు గలవాడై యుండి రోగి చిత్తాన్ని తనయందు ఆకర్షింపబడేటట్లు ప్రవర్తించాలి.

అలాగే రోగి డాక్టరు యందు విశ్వాసము కలిగి వుండాలి. "గురి కుదిరితేగాని గుణము కుదరదు" అనే సామెతను బట్టి ప్రవర్తించి మందు పుచ్చుకునే ముందు విశ్వాసముండాలి. ప్రశాంతంగా పుచ్చుకోవాలి. ఆ మందుతోనే గుణం కుదురుతుందని అనుకోవాలి. అందుకే అంటారు The patient must help the Doctor అని. మందులు ఎన్ని మ్రింగినా లాభం లేదు. మనస్సు మార్చుకోవాలి, నమ్మకం కలిగించు కోవాలి. మనసే అన్నిటికీ ప్రధానం. రోగికి విశ్వాసము ద్వారా స్వస్తత కలుగును.

వీరు పూవు, తావి వలె విడదీయరాని ధర్మమార్గమున దివ్యజీవనులై దీనజన సేవల నేమరక, తాము సంస్థకు ఉంచుకొనిన నామము సార్థక మగునట్లు, సుమారు ఇరువదైదు సంవత్సరాల కాలము శ్రమించి ప్రజాభిమానమును చూరగొని, గుంటూరు వైద్యవృత్తిలో తమ లక్ష్యమును సాధించుట సామాన్య విషయము కాదు. ఈ కాలములో వీరు కేవలము ధనార్జనమే లక్ష్యముగా గాక; బహువిధములగు ప్రజోపయోగ కార్యము లొనర్చి తమ తనువు; మనువు ధన్యమొనర్చుకొని బహువిధమగు కీర్తి నార్జించిరి. అందుకు తార్కాణముగా డా. సదాశివరావు సారస్వతరంగమున సలిపిన కృషి, చేసిన సేవ నిదర్శనములు.

తాను కుడిచేతితో ఒనరించిన మంచిని. ఎడమచేయి ఎరుగ కూడదనెడు లక్ష్యముగల ఈ వ్యక్తి తాను ఎంత నిస్సంగుడుగా ప్రవర్తించినను; తానొనర్చిన గుప్త దానములు: ఆదుకొనిన పేదకవుల ఆశీస్సులు, కాలవశమున బయటకు రాక మానుట లేదు. అందులకు నిదర్శనముగా; కీ. శే. జాషువా గారి “నుడు’’ లను పేర్కొనిన చాలును.

''అనుభవించిన గాని తెలియదు'' అను ఆర్యోక్తిని గుర్తించిన ఈ శ్రమజీవి, నిశిత దృష్టులు ఎల్లప్పుడు రోగార్తుల యందే ప్రసరించును. వారిసేవలో తన సుఖమును గూడ మరచి శ్రమించుచుండును.

''యధా రాజాః తధాః ప్రజా'' అనునట్లు అధిపతిని అనుసరించి అనుచరులు గూడ తమ లక్ష్యము; మానవసేవయే అనుసూక్తి నేమరక ప్రవర్తించుచుండుటచే వారుగూడ యజమాని హృదయమును, ప్రజల మెప్పును బడయగలిగిరి. అందులకు నిదర్శనముగా, సంస్థను ప్రారంభించినపుడు, చేరిన, కాంపౌండర్లు, నర్సులు మొదలగు సిబ్బంది కూడా నేటికి గూడ తమ పదవులను ప్రపుల్ల వదనమునతో నిర్వహింపగలుగుచున్నారంటే డాక్టరు దంపతుల యెడల వారికి అవ్యాజానురాగమును పేర్కొనవచ్చును.

బాధావహులై నర్సింగు హోము నందు ప్రవేశించిన రోగార్తులు, శరీర రుగ్మతలతో పాటు మానసికవ్యధలను కూడ బాపుకొని; హసితముఖులై వెడలు చున్నారంటే ఇక్కడ జరుగు ఆదరణ, వైద్య సదుపాయముల విలువ గ్రహింపవచ్చును. అందువలననే అచిర కాలములో అత్యున్నత స్థానము నాక్రమించి, తగినరీతిగా, రజతోత్సవము నొనరించు కొనుచున్న ఈ సంస్థ ఇక ముందు గూడ ఇట్లే తన విధులను నిర్వర్తించుచు ఇతోధికమైన యశము నార్జించి; తదధిపతులైన; డా. సదాశివరావు దంపతులకు ధనము, యశము కూర్చి, స్వర్ణోత్సవము గూడ జరుపుకొని, తన నీడకు చేరువారికి '**కామితార్థము లొసంగు, కల్పశాఖయగు గాక**.' యని భగవానుని ప్రార్థించుచున్నాను.

పండిన కలలు

యస్. పకీరయ్య

రెండవ ప్రపంచ యుద్ధానంతరం 1949వ సం॥ లో నాకు టైఫాయిడ్ జ్వరము వచ్చింది. తగ్గిపోయింది. తరువాత మా అమ్మకు కూడా టైఫాయిడ్ వచ్చింది. నాకు మందిచ్చిన ఆచార్యులు గారే మా అమ్మకు నెలసరి వచ్చిందనీ తాను ముట్టుకోనని వైద్యం చేయలేదు. గుంటూరు తీసుకొని వచ్చినా నయము కాలేదు. తరువాత ఆమె మరణించింది. అంతకు రెండు, మూడేళ్లు ముందు మావూరి వారికి ఇరవై మందికి టైఫాయిడ్ రావటమూ, గుంటూరు తీసుకరావటమూ, మరణించటమూ జరిగింది.

ఆ రోజుల్లో గుంటూరులో వైద్యము కాంట్రాక్టు పద్ధతిలో ఉండేది. రోగి చనిపోయినా బ్రతికినా, డాక్టరుకు ముందుగా రెండువందలో, మూడువందలో ఇచ్చుకోవలసి వుండేది. ఆ రోజులు రోగులపాలిటికి చాలా నికృష్టమైనవి. వాటిని తలుచుకొంటే ఇప్పటికీ వళ్లు జలదరిస్తుంది. వైద్య పద్దతిలో గొప్ప మార్పు రావాలని నేను కలలు గనే వాణ్ని. దళారి లేకుండ రోగులు నేరుగా డాక్టరు గారి వద్దకు వచ్చి తమ బాధలు చెప్పుకుంటే ఆదరణతో చూచే డాక్టర్లు కావాలని నేను గనే కలలు, ఆ కలలు కలలుగానే మిగిలి పోతాయేమో అని నిరాశ పడ్డాను.

కాని నేను కలలు గన్న దేవుణ్ని 1951 జులై లో చూడగలిగాను, అది పూజ్యులైన డాక్టరు సదాశివరావు దంపతులను కలసికొన్న రోజు. నేను ఆశించిన వైద్యము సామాన్యునికి జరగటం చూచిన మొదటిరోజు.

రోగికి మందులు వ్రాసి ఇచ్చి వైద్యము చేయటమూ, నయమైన తరువాత వారి తాహతును బట్టి డబ్బుతీసి కొనటమూ, ఒకవేళ నయము కాక రోగి మరణిస్తే డబ్బు తీసుకోకుండా వదలి వేయటమూ ఇక్కడే నేను మొదటిసారిగా చూచాను. చూచి అపూర్వానుభూతిని పొందాను. దీర్ఘంగా ఆలోచించి రోగనిర్ణయం చేయటం, చాలా తక్కువఖర్చుతో మందులు వాడటము, చిన్న చిన్న రోగాలకు మందులు వ్రాసి పంపటమూ, పెద్ద రోగాలకు మాత్రమే మంచాలిచ్చి మందులివ్వటమూ జరుగుతూ వుండేది. రోగులభయాన్ని పోగొట్టి, నచ్చజెప్పి రాత్రింబవళ్లు వారికి సేవ చేయటం డాక్టరు దంపతులు

నిత్యకృత్యంగా పెట్టుకొన్నారు. వారి జాగరూకత వలన రోగులెందరో మృత్యువు నుండి తప్పించుకొన్నారు; వారిలో ఈ దంపతులవి అమృతహస్తాలు.

వారి చేతి చలువతో ఎన్నో కుటుంబాలు సుఖశాంతులు పొందగలిగాయి. ఈ పుణ్యదంపతులను గన్న తల్లిదండ్రులకు నా జోహారులు.

నా కలలను ఫలింపజేసిన ప్రజావైద్యశాలకు, నాకు ఆనాటి నుండి విడదీయరాని సంబంధ మొకటి యేర్పడినది. పదిరోజుల కొకసారియైనా అచటికి పోకుండ నేనుండలేను. చూడకపోతే ఏదో పోగొట్టుకొన్నట్లు బాధ పడుతుంది మనసు.

ఈ ప్రజావైద్యశాలకు సిల్వర్ జూబిలీ మాత్రమే కాకుండా గోల్డెన్ జూబిలీ కూడా జరుపుకోవటానికి డాక్టరు దంపతులకు పరమేశ్వరుడు ఆయురారోగ్య సౌభాగ్యాలని ప్రసాదించాలని నా కోరిక. నేను మరణించక ముందే ఆ గోల్డెన్ జూబిలీ చూడాలని నా ఆకాంక్ష.



"చల్లని చేయి"

శ్రీ పి.వి.ప్రకాశరావు

ఉదాత్తమైన వృత్తులలో వైద్యవృత్తి ఒకటి. అయితే ఈనాడు వైద్యవృతిలో ఉన్నవారంతా ఉదాత్తులని చెప్పలేము. వైద్యవృత్తి విశిష్టతను కాపాడుతున్న వారిలో డాక్టరు సదాశివరావు, డాక్టరు జయప్రదాంబ దంపతులను చేర్చవచ్చు. స్వానుభవంలో గ్రహించిన సత్యాలను బట్టి నేనీ విషయము గట్టిగా చెప్పగలను.

రెండవ ప్రపంచ యుద్ధానంతర స్థితి రెండవ ప్రపంచ యుద్ధానంతరము ఆధునిక వైద్యము విశేషమైన ప్రగతి సాధించింది. సామాన్య ప్రజానీకము కూడ దేశీయవైద్యాన్ని విస్మరించి ఆధునిక వైద్య, శస్త్రచికిత్స ప్రాధాన్యతను గుర్తించారు. సరిగా అలాంటి మార్పు వచ్చిన దశలో డాక్టరు సదాశివరావు, డాక్టరు జయప్రదాంబ దంపతులు గుంటూరులో ప్రాక్టీసు పెట్టారు.

డాక్టరు హోదా రోగి ఆర్థికస్తోమత

అప్పటి వరకు డాక్టరు స్టేటస్ ను బట్టి రోగుల వద్ద ఫీజు వసూలు చేసే పద్ధతి అమల్లో ఉండేది. రోగి ఆర్థిక పరిస్థితిని బట్టి ఫీజు వసూలు చేసే క్రొత్త పద్ధతిని ప్రవేశపెట్టిన కొద్ది వైద్యశాలల్లో **ప్రజావైద్యశాల** ఒకటి.

" క్షయరోగిని లోపల ఉన్న భయంకరమైన క్రిమి పట్టి పీడిస్తున్న సమయములో బయట ఈ డాక్టరు క్రిమి కూడ పీడించటము మొదలు పెడితే ఇక ఆ రోగి ఎలా బ్రతికి బట్టగట్ట గలుగుతాడని" డాక్టరు కొడాలి వీరయ్య గారు అన్న మాటలను డాక్టరు సదాశివరావుగారు పలు సందర్భాలలో ప్రస్తావించారు.

దీనిని బట్టి వైద్యవృత్తి విషయములో డాక్టరు సదాశివరావు గారి మౌలిక దృక్పధం ఏమిటో విశదమవుతుంది.

విద్యార్థిగా నా పరిచయము

1854 లో నేను నా చదువు కోసం గుంటూరు చేరాను. అ రోజులలో నేను ఈస్నోఫీలియాతో బాధపడుతూ ఉండేవాణ్ణి. ఇంజక్షను చేసే కాంపౌండరును పరిచయం చేయమని మిత్రుడు దేవభక్తుని సుబ్బారావును కోరగా డాక్టరు సదాశివరావు గారివద్దకు వెళ్ళమని నన్ను అనేక విధాల ఒప్పించి పంపారు. ఆ విధంగా డాక్టరు సదాశివరావు గారితో నా పరిచయము ప్రారంభమైంది.

మిత్రుడు సుబ్బారావుకు డాక్టరు సదాశివరావు గారి మీద అంత "**గురి**" ఏర్పడటానికి కారణము ఉంది. సుబ్బారావుగారి సోదరుడు బుచ్చిరావు అనీమియాతో బాధపడుతూ అనేకమంది ప్రసిద్ధ వైద్యుల వద్ద చికిత్స పొందిననూ ప్రయోజనము కనుపించ లేదు. చివరకు డాక్టరు సదాశివరావు గారి వద్దకు వెళ్ళగా రోగిని పరీక్షించి కేవలము కొన్ని అణాలు మాత్రమే విలువ చేసే "**హైడ్రోక్లోరిక్ యాసిడ్**" తో ఆ రోగాన్ని దహితం చేశారు. చదివింది M. S. అయినా రోగనిర్ణయములో M.D.కి సాటిగల ధీశక్తి డాక్టరు సదాశివరావు గారికి ఉంది.

స్నేహశీలి:

డాక్టరు సదాశివరావు గారు మానవతావాది, స్నేహశీలి. వయస్సులో, విద్యలో అంతస్తులో గల వ్యత్యాసాలను విస్మరించి మనసిచ్చి మాట్లాడ గలిగిన స్నేహశీలి డాక్టరు సదాశివరావుగారు. డాక్టరు గారిలోని ఈ గుణం వల్లనే నేను ఆయన స్నేహితుడను కాగలిగాను.

అగ్ని పరీక్ష:

1959, 1960 లో నేను చాల క్లిష్టసమస్యను ఎదుర్కొనలసి వచ్చింది. నా భార్య శ్రీమతి రాజ్యలక్ష్మిని డెలివరీ, ట్యూబెక్టమీల కొరకు తెనాలిలో ఒక ప్రైవేటు నర్సింగ్ హోములో చేర్పించాను. రాజ్యలక్ష్మి డెలివరీకి ముందు నుంచి ఒక విధమైన జ్వరంతో బాధ పడుతుంది. డాక్టరు సదాశివరావుగారి వంటి ఉత్తమ వైద్యుణ్ణి, ఆత్మబంధువుని వదలి తెనాలిలో చేర్పించినందుకు నేను కొంతవరకు గిల్టీగా ఫీలయ్యాను. తప్పో ఒప్పో ఇలా చేశానని డాక్టరు సదాశివరావు గారికి చెప్పినపుడు ఆయన దానిని చాల తేలికగా

తీసుకున్నారు. అలా నిర్మొహమాటంగా చెప్పగల నా తత్త్వము. వినగలతత్త్వము నిర్వికారంగా డాక్టరు గారి తత్త్వము. నా స్నేహానికి రక్ష.

అలా తెనాలిలో మూడు నెలలు చికిత్స పొందినా నా భార్యకు స్వస్తత చేకూరలేదు. అందువలన గుంటూరు జనరల్ ఆసుపత్రికి మారవలసి వచ్చింది. అక్కడ అయిదు నెలలు ట్రీటు మెంటు పొందిన పిమ్మట పరిస్థితి పూర్తిగా క్షీణించింది. జబ్బు నిర్ధారణ చెయ్యబడలేదు. Neerosis of lion గా భావిస్తూండేవారు, ఆ పరిస్థితులలో జనరల్ ఆసుపత్రి నుండి రైలుపేటలో ఒక ఇంటిలోనికి మారాము.

ఒక నాలుగురోజులు నిశితముగా పరిశీలించి డాక్టరు సదాశివరావు గారు **'గరళప్రయోగచికిత్స'** కు సాహసించారు. "**కాలా జారు**" జబ్బుకు వాడే మందులు వాడారు. అది సత్ఫలితాన్నిచ్చింది. దక్కదనుకున్నా రాజ్యలక్ష్మి బ్రతికింది, ఒకవేళ అది కాలాజారు కానట్లయితే (ఆసుపత్రి టెస్టులో కాలాజారుకు వాడే మందులు కాదని పరిశీలనలో తేలింది) మందు వల్లనే రోగి మరణించుట ఖాయము, ఆ విషయము తెలిసి రోగి మరణిస్తే ఆ చెడ్డపేరు తనకి వస్తుందని తెలిసి కూడ డాక్టరు సదాశివరావు గారు సాహసం చేసి, నాకు ఎనలేని సాయం చేశారు.

ఆ రోజు సంవత్సరాది పండుగ. డాక్టరు గారు ఉదయము పూట వచ్చారు. ఇది ఇంజక్షను చేసే రోజు గాదు. డాక్టరు గారు పొరపాటున వచ్చారేమోనని ఆలోచిస్తున్నాము. ఇంతలో ఈ రోజు ఇంజక్షను చేయటానికి సంవత్సరాది శుభాకాంక్షలు చెప్పటానికి వచ్చామన్నారు. ఇప్పటికి మా కోసం ప్రతివత్సరాదికి ఉదయము డాక్టరు గారు మా ఎదుటకు వచ్చినట్లే ఉంటుంది.

నేనూ మా డాక్టరు గారు

ప్రత్తిపాటి అంకమ్మ చౌదరి, మురసాయ పాలెం

Wealth is lost, nothing is lost,

Health is lost, something is lost,

If Character is lost, everything is lost." - Abraham Lincoln

నేను రెండు విధాలుగా అదృష్టవంతుడ్ని. మొదటిది, వైద్యవృత్తి ద్వారా ప్రజా హృదయాలపై 25 సంవత్సరాలుగా చెరగని ముద్ర వేసుకొని ఆదర్శమైనడాక్టరుగా, ప్రజల డాక్టరుగా ప్రసిద్ధి గాంచిన డాక్టర్ సదాశివరావు గారికి నేను మొదటి పేషెంటును కావడం.

రెండవది. మొదటి రోగిని అయినప్పటికీ 25 సంవత్సరాల తరువాత కూడా యీ లోకంలోనే చెక్కు చెదరకుండా వుండ గలగడం.

ఎందుకంటే, సాధారణంగా మొదటి పేషెంటు ఆ డాక్టరు గారిని మరలా యీ లోకంలో చూడటం అరుదు.

అవి నేను యింటర్మీడియట్ చదువుచున్న రోజులు.గుంటూరులో సాంబశివ పేటలో వుంటున్నాము. నాకు అప్పుడు "జాండిస్ " వచ్చింది. రెండురోజుల నుండి ఎవరికైనా చూపించు కొందామని అనుకొంటూ వుంటే, ఒకరోజు "కొత్తగా డాక్టరుగారు వచ్చారు. ఈ రోజే హాస్పిటల్ open చేశారని" మేము కాలేజీ నుండి రావడంతోనే చెప్పారు. సరే చూపించుకొందామని వెళ్ళాను. ఆరడుగుల విగ్రహం, నవ్వుతూ ఆకర్షణీయంగా వున్న ముఖం. చూడడంతోనే ఏదో గౌరవభావం మనసులో కలుగుతుంది. చిరునవ్వుతో పలుకరించి, వచ్చిన విషయం అడిగి నన్ను ఎంతో శ్రద్ధగా పరిక్ష చేశారు. జబ్బుని గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. నేను మొదటి పేషెంటును కావటం వల్లనో లేక డాక్టర్లకు యిప్పటి లాగా అప్పుడు ప్రత్తి వ్యవసాయం చేయడం లాంటి యితరత్రావ్యాపకాలు లేక పోవడం వల్లనో గాని చాలా జాగ్రత్తగా పరీక్ష చేశారు. మందులు వ్రాసియిచ్చారు. పూర్తిగా తగ్గి పోయింది. అదీ అసలు మా డాక్టరు గారితో పరిచయం.

అసలు డాక్టరు సదాశివరావుగారి వైద్యపరీక్ష, సలహాలు విచిత్రంగా వుంటాయి. రోగిని పరీక్షచేసి, "నీకేం జబ్బయ్యా! బాగా తిని తిరుగు" అని సలహా యిచ్చేవారు. రోగిని ఎక్కువగా Psychological గా treat చేసే వారు.

అలా అని పెద్దజబ్బులను నిర్లక్ష్యము చేసేవారు కాదు. ఒకసారి మావూరి నల్లమోతు నాగేశ్వరరావు గారికి టైఫాయిడ్ జ్వరం వచ్చింది. అప్పుడు కొత్తగా "Chloromycetin" మందు వచ్చిన రోజులు. నాగేశ్వర రావు గారికి పరీక్ష చేసి, టైఫాయిడ్ జ్వరం అని చెప్పి Chloromycetin మందులు యిచ్చారు. కాని అవి నాలుగు గంటల కొక Capsule వేయాలి. అందువలన మాకు చాలా Serious గా warning యిచ్చారు. మేము వంతులు వేసుకొని నాలుగు గంటలకొకళ్ళము చొప్పున Capsule యిచ్చేవాళ్ళము. కాని ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే మాకు చెప్పినా మేము వేళకు, సమయానికి యిస్తామో లేదోనని మాకు తెలియకుండా రాత్రిపూట మా Roomకు వారే వచ్చేవారు. అలాగ డాక్టరుగారు రోగి మీద ఎంతో శ్రద్ధ తీసుకొనే వారు. అసలు ఆ రోజుల్లో డాక్టర్లు రోగిని ఎంతో జాగ్రత్తగా చూసేవారు. కాని యీ రోజుల్లో డాక్టర్లే వేరు. ఈ రోజుల్లో వైద్యవృత్తికంటే డాక్టర్లకు ఇతర వ్యాపకాలు పెచ్చు పెరిగిపోయాయి.

వైద్యము మీద ఏకాగ్రత తగ్గి పోయింది. ఒకసారి ఒక డాక్టరు రోగిని పరీక్ష చేస్తూ వున్నాడు. ఆ డాక్టరుగారికి ఒక ట్రాక్టరు వున్నది. అ డాక్టరు గారు రోగిని పరీక్షచేస్తున్న సమయములోనే ఆ రోగి ఖర్మ కాలి ఆ ట్రాక్టరు డ్రయివరు ట్రాక్టరుకు సామాను ఏదో పోయింది, కొత్తది కొనాలి, డబ్బు కావాలి అని వచ్చాడు. ఆ ట్రాక్టరు డాక్టరు గారు ఉగ్రరూపం దాల్చారు. రోగి మీద వున్న దృష్టి డ్రయివరు మీదకు మళ్ళింది. డ్రయివరును నానా చీవాట్లు వేశారు. అయితే అసలు విషయమేమిటంటే అసలు ఆ సామాను రెండు రోజులు క్రితము పోతే డాక్టరు గారే స్వయంగా వేయించారట. అదే విషయాన్ని డ్రయివరుతో హాస్పిటలు ఎగిరి పోయేటట్లుగా అరుస్తూ చెబుతున్నాడు. రెండు రోజుల క్రితం వేసిన సామాను యీ రోజుకే పోతే యిక నిన్ను పెట్టుకొని దివాలా తీయాల్సిందే. అని నానా మాటలు అన్నాడు. అక్కడ వినేవాళ్లకే అసహ్యమనిపించింది. డ్రైవరులో కూడా ఓర్పు నశించింది. ఎవరైనా యీ రోజుల్లో పెడితే తింటారు కాని తిడితే పడరుగదా!

డ్రయివరూ రెచ్చిపోయాడు "రెండురోజులక్రితం వేసిన సామాను పోతేనే అలా తిడుతున్నావు. నీ మందులుయిచ్చే వాళ్ళందరూ బతుకుతున్నారా? మొన్న నీవు ఆపరేషన్ చేసిన మనిషి చచ్చిపోతే నీవేమి చేశావు'' అని ముఖం మీదే ఆ డ్రయివరు అనేసరికి డాక్టరు గారికి యిక నోట మాట రాలేదు. అతని వరస మారిందను కొన్నాడో ఏమోగాని ఏమీ మాట్లాడలేక అప్పటి కప్పుడే అతని జీతం లెక్కచూచియిచ్చి అతనిని పనినుండి తీసేశాడు. ఇప్పుడు ఆట్రాక్టరు, డాక్టరు లేని గవర్నమెంటు ఆసుపత్రిలాగా డ్రయివరు లేనిదయి పోయింది. తరువాత రోగిని పరీక్షచేయడం. మొదలు పెట్టారు ఆ డాక్టరుగారు. రోగిని దాదాపు 10 నిముషాలు పరీక్ష చేస్తూనే వున్నాడు. ఆలస్యమైనా రోగిని బాగానే

పరీక్షచేస్తున్నాడులే అనుకొన్నాము. కాని అది కాదు అసలు సంగతి. ఆయన పరధ్యానంలోవున్నాడు.

రోగిమీదకాని రోగంమీద కానీ ఆయన మనస్సు లేదు, ఆ డ్రయివరులేని ట్రాక్టరు మీదే ఆయన మనస్సంతా కేంద్రీకరించివుంది. ఎందుకంటే పరీక్ష చేస్తూనే యీ 10 నిముషాలలో ఎక్కడికో రెండుసార్లు ఫోన్ చేశాడు ట్రాక్టరుకు డ్రయివరు కావాలని. ఇక యీ లోపు ఇంత సేపటినుండి పరీక్ష బల్లమీద పడుకొనివున్న రోగి పరిస్థితి ఎలావుంటుందో మీ వూహకే వదులుతున్నాను.

ఇలావున్నవి. ఈ రోజులలో వైద్యాలు. అసలు డాక్టరు అయినవారు ఏ వ్యాపకమూ పెట్టుకోకూడదని. కాని ఎప్పుడూ అదే ఆలోచన మీద వుండకూడదనేదే అభిప్రాయం. గుడిలో కెళ్లినపుడు దేవుని మీదే మనసు వుంచి పూజ చేయాలి కాని వాళ్ళ మీదో లేక వేరే వాళ్లమీద, యితర వ్యాపాకాలమీదో మనసు నుంచితే అది పూజే కాదు. అలాగే కనీసం హాస్పిటలులో వున్నంతసేపు, ముఖ్యంగా రోగిని పరీక్ష చేసేటప్పుడయినా రోగిని గురించి, రోగాన్ని గురించి ఆలోచిస్తే వైద్యవృత్తికే న్యాయం చేసిన వారవుతారు. అసలు డాక్టర్లు వైద్యవృత్తి కంటే ఎక్కువగా యితర సమస్యలతో వుంటే రోగికి ఎలా న్యాయం చెయ్యకలరు! ఎప్పుడూ విసుక్కుంటూ చీదరించుకొంటూ వుంటాడు. ఎందుకంటే, ఆయనకు రోగి, రోగం కంటే ట్రాక్టరుకు డ్రయివరు, పోయిన సామానూ పెద్దసమస్యలై కూర్చొంటాయి.

కాని మా డాక్టరుగారు సదాశివరావుగారు ఎప్పుడూ నవ్వుతూ రోగులతో హుషారుగా కబుర్లు చెబుతూ పరీక్ష చేస్తూవుంటారు. అసలు డాక్టరు రోగితో నవ్వుతూ మాట్లాడితేనే సగం జబ్బు నయమవుతుంది. జీవితములో ఎంతో బాధపడి నైతికంగా పతనమయి జబ్బున పడ్డవాళ్లూ, మానసికంగా దెబ్బతిని జబ్బున పడ్డవాళ్ళూ, సమాజములో దగాపడ్డవాళ్లూ అనేక రకాల రోగులు డాక్టర్ల దగ్గరకు చికిత్సకోసం వస్తూంటారు. ఎందరో వ్యాధితీవ్రతకు తట్టుకోలేక జీవితంపై విసుగు చెంది వస్తూంటారు. వారందరిని సానుభూతితో అర్ధం చేసుకొని చక్కని వైద్యంతో వారికి జీవితంపై మరలా ఆశ కలిగేలా చేయాల్సిన బాధ్యత ప్రతి డాక్టరు మీదా వుంది.

అసలు రోగికి చికిత్స చేయడంకన్నా రోగనిర్ధారణ సరిగా చేసి (Diagnosis) సలహా చెప్పడంలోనే డాక్టర్లు ఎంతో నేర్పు చూపించాల్సి ఉంటుంది. అసలు అదొక కళ. రోగిని బల్లమీద పడుకోబెట్టి పరీక్ష చేస్తూ నర్సు చేతి కిచ్చిన తాళాలతో బీరువాలో శాంపిల్ మందులు దొంగిలించుతుందోనని మనస్సంతా. ఆ నర్సుమీదే వుంచి రోగిని పరీక్ష చేస్తే రోగం వేరవుతుంది, చికిత్స వేరవుతుంది. ఈ రోజుల్లో వైద్యశాస్త్రం ఎంతో అభివృద్ధి చెందుతుంది. కాని క్షమించాలి. వైద్యులు మాత్రం అభివృద్ధి చెందడంలేదు. ఎందుకంటే

వైద్యులు రోగులకు చికిత్స చేయడం ఒక ఎత్తు. రోగితో మాటాడటం ఒక ఎత్తు. ఎన్నో శారీరక మానసిక బాధల ననుభవించి, మధురమైన జీవితాన్ని ఆశించి డాక్టరు దగ్గరకు వస్తాడు రోగి.

ఆ రోగిని ఎంతో సానుభూతితో దగ్గరకు తీసుకొని అతని బాధలు, అన్నీ చక్కగా అర్థం చేసుకొని ఆ రోగికి మరలా జీవితంపై ఆశకలిగేలా చేయాల్సి వుంటుంది డాక్టర్లు. విద్యలో వెనుకబడి, మూఢనమ్మకాలతో వున్న మనదేశపు రోగులకు ఎంతో ఓర్పుతో నేర్పుతో సలహాలు యివ్వడం చికిత్స చేయడం ఎంతో అవసరము. డాక్టర్లను గురించి సర్ విలియం ఆస్లర్ చేసిన హితోపదేశం యిక్కడ ఉదహరించడం మంచిదేమో!

"నీవిచ్చు మందులు, మాత్రలు కంటే బలహీనులను, నీతి హీనులను, జ్ఞానహీనులను, ఆరోగ్యహీనులను ఉత్తేజము జేయు నీయొక్క సద్భావమే ప్రధానము."

డాక్టరుసదాశివరావు గారికి ఈ సద్భావమే పెచ్చుగావుంది. దానికితోడు దయార్ద్రహృదయమూవుంది. మా డాక్టరుగారు ఓర్పుగా, చికిత్సచేసేవారు. వైద్యం ద్వారా ప్రజలకు సేవజేయడం మొదలు పెట్టి ఇప్పటికి 25 సంవత్సరాలు నిండాయి. దేశంలోనూ, వైద్యశాస్త్రంలోనూ అప్పటికీ, యిప్పటికీ యీ యిరువదిఅయిదు సంవత్సరాలలో చాలా మార్పులు వచ్చాయి. ఆ రోజులు వేరు. ఈ రోజులువేరు. ఆ రోజులతో ఈ రోజులను పోల్చుకొంటే మనకే ఆశ్చర్యమేస్తుంది. వైద్యశాస్త్రం ఎంతో అభివృద్ధిచెందింది. ఇదివరకు రోజుల్లో క్షయ జబ్బువస్తే యిక్కడెక్కడా తగ్గక మదనపల్లె శానిటోరియంకు పోవాల్సి వచ్చేది. కాని ఈ రోజు Streptomycin లాంటి మందులు వచ్చి మహా భయంకర క్షయవ్యాధి మామూలు జ్వరం క్రింద మారిపోయింది. టైఫాయిడ్ లాంటి బలమైన జ్వరాలకు కూడా మంచి మంచి మందులు కనిపెట్టారు. అన్నిటికంటె విచిత్రము మన రేడియో చెడిపోతే చెడిపోయినభాగాలు తీసివేసి కొత్త భాగాలు వేసి ఎలా బాగుచేస్తారో అలాగే శరీరంలో కూడా ఏదయినా ఒక భాగం చెడిపోతే ఆపరేషన్ చేసి చెడిన భాగం తీసివేసి కొత్త భాగం వేస్తున్నారు. మూత్రపిండాలు, గుండెలాంటి ప్రధాన భాగాలు సైతంమార్పిడి చేస్తున్నారు.

1954వ సంవత్సరములో బోస్టన్ (Boston) హాస్పిటలుకు చెందిన డాక్టర్ జోఫ్ ముర్రే అను డాక్టరుగారు రోనాల్డ్ హెరిక్స్ అనువాని మూత్ర పిండములు తీసి రిచర్డు హెరిక్స్ ఆనువానికి ఆపరేషన్ చేసి అమర్చాడు. రోగి 8 సంవత్సరములుమాత్రమే జీవించ గలిగాడు. ఇప్పుడు మన ఇండియాలో ప్రథమంగా వెల్లూరు క్రిష్టియన్ ఆసుపత్రిలోకూడా చేస్తున్నారు. ఇప్పుడు మహా భయంకరంగా తయారయిన కేన్సరుకు తగిన చికిత్స కనుగొనడంలో వైద్యులు ఎంతో కృషి చేస్తున్నారు. యింకా ఎన్నో విధాలుగా వైద్యశాస్త్రం ఎంతో అభివృద్ధి చెందుతుంది. అయితే ఆధునిక వైద్యపద్ధతులతో పాటు ఆధునికమైన జబ్బులు కూడా

వస్తున్నవి. ఇది బహుశా మన ఆధునిక జీవన విధానాన్ని బట్టి వస్తున్నదేమో!. ఆధునిక యుగంలో నేటి మానవుడు యింట్లో Tiffin చేసి పోర్టికోలోకి వచ్చి, కారులో ఎక్కి ఆఫీసుకెళ్ళి, మరలా అక్కడ ఆఫీసులో పోర్టికోలో దిగి, లిఫ్టులో పై అంతస్తులో కెళ్ళి ఆఫీసు పని చూచుకొని భోజనం కూడా చేసుకొని మరలా అక్కడే పూర్తి రాత్రికి అదేపద్ధతిలో యింటికి చేరుతున్నాడు. అతనికి సరయిన వ్యాయామం ఎక్కడ దొరుకుతుంది? మన ఆధునిక జీవన పద్ధతులతో బాటు మన జబ్బులు కూడా ఆధునికంగానే వుంటున్నాయి.

మనం తీసుకొనే ఆహారంలో పోషక పదార్థాలు చాలాతక్కువగా వుంటున్నాయి. మనదేశ జనాభా వూహకందని విధంగా పెరిగిపోతుంది. ఈ సమయంలో మన జాతిని Educate చేయాల్సిన బాధ్యత, డాక్టర్ల మీద ఎంతో వుంది. జాతి భవిష్యత్తు దీనిపై ఎక్కువ ఆధారపడి వుంది. కాని దురదృష్టవశాత్తూ మనదేశంలో అన్యాయం, అవినీతి విలయతాండవం చేస్తున్నాయి. ప్రతివారి ఆలోచనా ధనసంపాదన మీదే. అది ఎలా సంపాదించినా సరే! ప్రతివారూ డబ్బు సంపాదించుకోవాల్సిందే కాని దానికొరకు అడ్డు దారులు తొక్కి అడ్డమైన గడ్డి కరవటమే తప్పు. దురదృష్ట వశాత్తు జాతినాయకులు కూడా కంచేచేను మేసినట్లుగా అదేవిధంగా వున్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితులలో డాక్టర్లు వారి బాధ్యతను విస్మరించకుండా పవిత్రమైన వైద్యవృత్తిలో అవినీతిని ప్రవేశపెట్టకుండా. జాతి భవిష్యత్తును తీర్చిదిద్ది జాతికి నూతనోత్సాహాన్ని కల్గించి చైతన్యవంతముగా చేస్తారని ఆశిస్తున్నాను. యిది నేను ఎవరినీ ఉద్దేశించి వ్రాసినదిగాదనీ, నా బాధను, నా ఆవేదనను యీ రూపంగా మీకు విన్నవించుకొన్నానని తెలియజేసుకుంటున్నాను. మా డాక్టరుగారు దంపతులు తమ 25 సం॥ల వైద్యసేవ పూర్తయిన యీ సందర్భములో నేను మొదటి పేషెంటు నయినప్పటికీ నన్ను యీలోకంలో సజీవంగా నిలిపి, యీ రోజున నాకు మీతో యిలా పరిచయం చేసుకొనే వీలు కల్పించినందులకు నిండుమనసుతో అభినందిస్తూ, మా డాక్టరు దంపతులు యిలాంటి ఉత్సవాలు అనేకం చేసుకోవాలని మనసారా కోరుకొంటున్నాను.

మా డాక్టర్లు

శ్రీ కట్టా వెంకట సుబ్బారావు

శ్రీడాక్టరు సదాశివరావు గారు గుంటూరులో Peoples Nursing Home పెట్టినప్పటి నుండి, మా కుటుంబ వైద్యులే గాక మా గ్రామవైద్యులు, మధ్యతరగతి రైతు కుటుంబము నుండి వచ్చినందున, వారికి సామాన్యుని ఈతిబాధలు తెలుసు. ఆడంబరము లేని జీవితం, అందరితో కలసి మెలసి, ఆప్యాయంగా మాట్లాడే సరసత్వం, ఆయనకున్న లౌకికజ్ఞానం, జ్ఞాపకశక్తి అపారం. అన్నింటికన్నా మనసు దొడ్డది. కష్టాలలో వున్న వ్యక్తిని చూస్తే హృదయం కరిగి పోతుది. (కదులుతుంది). యీ నాటికీ, వైద్యసహాయములో(Treatment) శ్రీమంతుడికి సిరిలేనివానికి వ్యత్యాసము కనబడదు. పైపెచ్చు వారివద్ద వున్న శాంపిలు మెడిసన్సు ఆర్ధికముగ వెనుబడిన వారికిచ్చి సహాయపడతారు. బీదలు వైద్యసహాయముపొంది, పూర్తి ఆరోగ్యవంతులై హాస్పటలునుండి పోయేటప్పుడు, "అంత డబ్బు అవసరము లేదు, యింత యిస్తే చాలులే" అని తగ్గించి చెప్పే ఉదారస్వభావులు, అందుకే కాబోలు. ఆ కులం, ఈ కులం అన్న విచక్షణలేక, అందరి ప్రేమాభిమానములు పొందగలిగారు. గుంటూరు జనరల్ హాస్పటలులో ఆనరరీ సర్జనుగా, గుంటూరు మెడికల్ కాలేజిలో, ఆనరరీ ప్రొఫెసరుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారు డాక్టరు గారిని నియమించుట, వారి నైపుణ్యతకు తార్కాణము.

Peoples Nursing Home దినదినాభివృద్ధి చెందుటకు, తోడునీడగా వుంటూ, ఎప్పటికప్పుడు ఉత్సాహ పరుస్తూ. సహాయ సహకారములిచ్చుచున్న వారి సతీమణి, శ్రీమతి డాక్టరు జయప్రదాంబగారే ముఖ్యకారకులు. ఆమె ప్రధమమునుండి విద్యా, వినయసంపన్నులు ఆదర్శగృహిణి. ప్రజాహిత కార్యకలాపాలలో పాలుపంచు కోవాలనే అభిలాష, సామాన్యులకు వైద్యసహాయము చేయాలనే కోరిక కలదని నిరూపించటానికి, వారి ఆధ్వర్యమున నిర్వహింపబడుచున్న గాంధి కస్తూరిబా ఉచిత వైద్యశాల నిదర్శనం.

వైద్యవృత్తిలో దంపతులకు గల అభిలాషకు తార్కాణం, వారి సంతతిని సగర్వంగా సమాజానికి సేవ చేయుటకు డాక్టర్లుగా తయారు చేయడమే.

మన డాక్టరు గారు బహుముఖ ప్రజ్ఞాశాలి, విద్యారంగములో డాక్టరు గారి కృషి మెచ్చదగినది. శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూలు, శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కాలేజి ప్రారంభించుటలో, డాక్టరు గారి కృషి ప్రశంసనీయము. కాలేజి ప్రారంభము నుండి సెక్రటరీగా, కరస్పాండెంటుగ వుంటూ, వీరెంతో కష్టపడి ఆంధ్రప్రదేశ్ లో వున్న ఉన్నత విద్యాప్రమాణాలు గల కళాశాలలలో ఒకటిగా చేయగలిగారంటే, ఎంత సమర్ధతగల పరిపాలనో మనం ఊహించుకోవచ్చు.

ఆంధ్ర యూనివర్సిటి సెనెటు మెంబరుగా, వారి సేవలు మరువరానివి. కవులను, పండితులనూ, కళాకారులను సదస్సులకు ఆహ్వానించడం, ఆదరించడం, వారితో సంభాషించడం. వారి కెంతో సంతోషము. డాక్టరు గారికి గురుభక్తి మెండు. అందుకు కారణం, వారి గురువులు చూపించిన ప్రేమాభిమానములే అనుకుంటాను. అందుకు నిదర్శనం, వారి గురువులు స్వయముగా, యీ Silver jubilee లో పాల్గొని, ఆశీస్సులు అందించుటయే.

చిరకాలము People's Nursing Home ద్వారా ప్రజాసేవ చేయుచూ, వారు చరిత్ర ప్రసిద్ధులగుదురు గాక. ఇట్టి సేవ చేయుచున్న, మా డాక్టరు సదాశివరావు, జయప్రదాంబ గార్లకు నా ధన్యవాదములు.

జీవని

డాక్టరు జెక్కంపూడి సీతారామారావు

చనిపోయిన వారినెవ్వరూ బ్రతికించలేరు. కాని..
కాలమున్న వారిని మాత్రం మృత్యు వీచట దరిచేరదు.
ప్రపంచములోని బాధనంతా ఒక్కరుగా ఎవరూ తుడిచి వేయలేరు.
కానీ, బాధోప శమనానికి ఇచట బద్ధకంకణులైన వారున్నారు.
వెలుగును అందరూ చూడలేరు చూపించనూ లేరు.
కానీ, కడుపు పండిన తల్లులెందరో ఇచట తమ కన్నుల వెలుగు నింపుకొన్నారు.
అనుబంధాలు శాశ్వతం కాదు. కాని,
తొలి శ్వాస పీల్చి, తొలి పిలుపు పిలిచి కనులు తెరచి తొలి
వెలుగులు చూచిన బిడ్డలెందరో మరల తమ ఒడిని ఇక్కడ నింపుకొన్నారు.
పరుల ఆర్తి ఆవేదనలు తమవిగా అనుభవించి,
కరుణా, అనురాగాలను పంచి పెట్టే తలిదండ్రులున్నారిచ్చట.
మానవతా సమ ధర్మాలకు, సమతా. మమతలకూ
చోటున్న చోటు ఇది.
ఎందరి జీవితాలలోనో జీవనజ్యోతి వెలిగించినచోటు

ఇది - జీవని - ఇదే జీవని

నా ఆకాంక్ష

కొండా పార్వతీ దేవి

మన ప్రాంతంలో శ్రీమతి డాక్టర్ జయప్రదాంబగారిని ఎరుగని వారు లేరు. వైద్యవిషయమును గాక, సాంఘిక రంగంలో పాతిక సంవత్సరాలుగా ఆమె చేయుచున్న సేవ ప్రశంసనీయము. స్త్రీ, శిశు సంక్షేమ అభ్యున్నతులకై పాటుబడుచున్న మహిళామణి సాటి సోదరీమణుల భాధల నవగాహన మొనర్చుకొనిన కొందఱు ఉత్తములలో ఆమె యొకర్తుక! గృహిణిగా తన కుటుంబ బాధ్యతా నిర్వహణముతో బాటు ఆదరాభి మానములతో దయా దాక్షిణ్యమలు ప్రదర్శించుట, తదనుగుణముగ వైద్యచికిత్స యొనర్చుట గమనార్హము.

1960 సంవత్సరములో గుంటూరు జిల్లాలో మేము నిర్వహించిన సాంఘిక సంక్షేమ కేంద్రాలుగల గ్రామములకు మాతో పాటు జయప్రదాంబగారు వచ్చి, స్త్రీలకు, శిశువులకు ఉచితవైద్య సలహాల నొసగిన సంఘసేవా పరాయణి.

మహాత్మాగాంధీ శత జయంత్యుత్సవ కార్యక్రమ నిర్వహణమున గుంటూరు జిల్లా కస్తురిబా సేవా సంఘమునకు ఉపాధ్యక్షురాలుగ నుండి, గాంధి కస్తూరిబా భవన నిర్మాణమునకు సర్వవిధముల జయప్రదాంబగారు చేయూత నిచ్చిరి.

అంతర్జాతీయ మహిళా సంవత్సరమున గాంధి కస్తూరి బా భవనమునందు నిర్వహించు కార్యక్రమములలో సద్భావముతో సహకరించి ప్రతి దినము సాయం కాలము 4గం. నుండి 6గం. వరకు బీదలగు రోగులకు ఉచిత వైద్య సలహాల నొసగుచున్న ఉదార నారీమణి. అంతియేగాక, అనాథ స్త్రీలకు జీవనోపాధిని కల్పించుటకై చేతి పనులు నేర్పించు పథకమును ప్రవేశ బెట్టిన దూరదృష్టి పరాయణి.

ఈ సాంఘిక సేవా కార్యక్రమ నిర్వహణమున సకల విధముల కృషిసల్పు ఆదర్శ దంపతులు డాక్టర్ సదాశివరావు, జయప్రదాంబగారలు. ప్రతి మానవునకు ప్రధానమగు ఆరోగ్యమును చేకూర్చునట్టి వైద్యవృత్తి నవలంబించి, వీరుభయులును పేరుబడసిన డాక్టరులై, మానవ సేవ యొనరించుచుండుట ముదావహము.

ఈ మానవ సేవ యందు వీరు రజతోత్సవమునే గాక వజ్రోత్సవము చేసి కొనుటకు పరమేశ్వరు డాయురారోగ్య భాగ్యముల నొసగ వలయునని నా ఆకాంక్ష!

ఆదర్శ డాక్టర్ దంపతులు

దండమూడి మహీధర్
అసిస్టెంట్ ఎడిటర్ (ట్రాన్స్‌లేషన్)
ఆల్ ఇండియా రేడియో
హైదరాబాదు - 500 004

'ప్రజావైద్యశాల'ను స్థాపించి పాతిక సంవత్సరాల పాటు ప్రజలకు సేవచేస్తూ దాన్ని నిరాటంకంగా నిర్వహించి నందుకు గాను కాసరనేని సదాశివరావు, డాక్టర్ శ్రీమతి కాసరనేని జయప్రద గార్లకు సన్మానం జరిపేందుకు రజతోత్సవ సంఘం ఒకటి ఏర్పాటైనట్టూ, ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రత్యేక సంచిక నొకదాన్ని వెలువరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలియ జేస్తూ, ఈ సంచికలో ప్రచురణ నిమిత్తం ఒక వ్యాసం పంపించవలసిందని రజతోత్సవ కమిటీ కన్వీనరు డా॥ చదలవాడ వెంకట సుబ్బారావుగారు కోరారు. దీన్ని నేను ఎంతో సంతోషకర విషయంగా పరిగణించాను.

ప్రజావైద్యశాలను ప్రారంభించి పాతిక సంవత్సరాలు గతించాయి. అంతకు కొంత కాలం ముందే ఈ ఉభయుల వివాహం జరిగినందున, ఈ జరిగే రజతోత్సవం వారి వివాహ రజతోత్సముగా కూడా పరిగణించడం భావ్యంగా వుంటుందని భావిస్తాను.

డా॥ సదాశివరావు, డా॥ శ్రీమతి జయప్రద గార్ల వివాహం జరిగిన పది సంవత్సరాలకు అప్పటి 1959 సెప్టెంబరు 12వ తేదీన బ్రిటిష్ ప్రధాని సర్ విన్ స్టన్ చర్చిల్ తన వివాహ స్వర్ణోత్సవం జరుపుకున్న సందర్భంలో ప్రసంగిస్తూ తన ఔన్నత్యానికి ముఖ్యకారకురాలు తన సతీమణే అని ఆయన ప్రక్కనే కూర్చున్న క్లెమిన్‌టైన్ చర్చిలు చూపిస్తూ ఎంతగానో మరిసిపోతూ అన్నాడట!

బహుశా ఈ రజతోత్సవ సందర్భంలో డా॥ సదాశివరావుగారు కూడా ఈ మాటలే కాకపోయినా, ఇలాంటి అర్థం వచ్చే మాటలే అనవచ్చు! కాని చర్చిల్ భార్య వట్టి గృహిణిగా మాత్రమే తన విధిని తాను నిర్వర్తించి అంతటి ఘనతకు అర్హురాలైంది. మరి డా॥జయప్రదాంబ గారి విషయంలో అలా కాదే! మరి అటు గృహిణిగా, ఇటు డాక్టర్ గా రెండు బాధ్యతల్ని నిర్వహించారు.

డా॥ సదాశివరావు గారి ప్రతిభ ఇనుమడించడానికి, ప్రజావైద్యశాల పేరు ప్రఖ్యాతులు విస్తరిల్లటానికి జయప్రదగారి పాత్ర ఇందులో చాలా వున్నదని భావించవలసి వస్తున్నది.

ఏది ఏమైనా ఉభయుల సేవా నిరతి, కార్య దీక్ష, వైద్యశాస్త్ర ప్రజ్ఞా ప్రాథవాల కార వైద్యశాల ప్రారంభించిన కొద్ది కాలానికే అన్ని వర్గాల వారికి యీ ఇద్దరూ అత్యంత ఆత్మీయులుగా మారిపోవడం గుంటూరు చరిత్రలోనే అపూర్వమైన సంఘటనగా భావించడం జరిగింది. అతి అల్పవ్యవధిలోనే వైద్యంలో గుంటూరులో ఈ డాక్టర్ దంపతుల కన్న మిన్న మరెవరూ లేరనే భావం అందరిలోనూ వ్యాపించి పోయింది.

ఈ డాక్టర్ దంపతుల పేరు అగ్రశ్రేణిలో నిలిచివుండడానికి తగిన కారణాలు లేకపోలేదు. ఆ రోజుల్లో ఎం. ఎస్. ప్యాసైన డాక్టర్లు ఎవరూ ప్రైవేటు ప్రాక్టీసు పెట్టలేదు. ఆ ఖ్యాతి డా॥ సదాశివరావు గారికి దక్కింది. పోతే భార్యభర్తలిద్దరు డాక్టర్లు అయివుండి, వైద్యశాలను నడపడానికి పూనుకోవడం కూడా గుంటూరు పట్టణానికి కొత్త శోభను చేకూర్చి పెట్టింది. ఆ రోజుల్లో అందరి నోళ్ళల్లోను మరొక విషయం నానుతూ వుండేది.

అది డాక్టర్ దంపతుల ఆదర్శ వివాహం! కట్నం కానుకలు లేకుండా పూలమాలలు మార్చుకొని వివాహం చేసుకొని అందరి మన్ననలను అందుకున్నారు.

అలా ఆనాటి నుంచి అందరి మన్ననలను అందుకోవడం వల్లనే. ఎంతో మంది ప్రేమకు పాత్రులు కావడంవల్లనే ఈనాటికి ఈ ప్రజా వైద్యశాల ఈ రూపుదాల్చి ఇంతటి ఔన్నత్యానికి చేరుకున్నది. ప్రజలకు మరింత చేరువుగా వచ్చి తన పేరును సార్థకం చేసుకున్నది.

దీని సార్థక్యానికి ఉభయులూ కారకులయ్యారు కారణాలు లేకపోలేదు. డాక్టరు దంపతులను మనం విడివిడిగా చూడడం తటస్థ పడితే రెండు మహోన్నతమైన వ్యక్తిత్వాలు మన యెదుట నిలుపాయి.

ఉన్నత శ్రేణికి చెందిన కథా రచయిత్రిగా కీర్తి శిఖిరాల కెక్కవలసి డా॥ జయప్రదగారు వివాహం కావడంతోనే కథలు రాయడం మానేశారు. రాయడం కొనసాగించి వుంటే అనేక ప్రవృత్తులు కలిగిన పాత్రలు సృష్టించి కథారచనలో ఒక

నూతనత్వానికి నాందివాచకం పలికి వుండేవారు! అది జరగలేదు. అలా జరగకపోవడానికి కారణం, తీరిక లేకపోవడమేనని అంటూ వుంటారు నిజం. తీరిక దొరకడం కష్టమే!

అయితే వారు స్వయంగా రాయకపోయినా, ఈనాడు రాస్తున్న అనేక మంది రచనలు తు.చ. చదవడం నాకు తెలుసు ఆ చదవడం కూడా ఒక విమర్శనాత్మక దృష్టితో! ఇది డా॥ జయప్రదగారి విశిష్టత అని చెప్పాలి.

ఒకప్పుడు నా కథలకు ఒక పెద్ద క్రిటిక్ గా వ్యవహరిస్తూ ఉండేవారు. అనేక సూచనలు, సలహాలు పాటించి తదను గుణంగా రాయడం జరుగుతూ వుండేది. 'నువ్వు సగంలో ఆపివేసిన నవల పూర్తి చేసి నాకు పంపిస్తే నేనిక్కడ ప్రింటు చేయిస్తానని' కూడా నేను వార్తాలో వున్నప్పుడు రాశాను. ఇది ఎందుకు చెబుతున్నానూ అంటేరచనా వ్యాసంగం పట్ల వారికున్న ఆసక్తి అటువంటిది! అందుకే నేను రాసిన 'నిజం కావలసిన కలలు' వారికి అంకితంగా సమర్పించుకోవడం జరిగింది.

ఎప్పుడు హైదరాబాదు వచ్చినా ఇన్నేసి వస్తువులు పట్టుకెళ్ళడం డా॥ జయప్రద గారికి అలవాటు! ఒక పర్యాయం గద్వాల్ హేండ్ లూమ్ సెంటర్‌లో ఒక డజను చీరెలు కొన్నారు. సుల్తాన్ బజార్లో ఇంకేవేవో కొన్నారు, అప్పటికి పెద్దమ్మాయికి పెళ్ళి కూడా కాలేదు. ఉండబట్టలేక 'ఇవన్నీఎవరికి?' అని ప్రశ్నించాను. సమాధానం చెప్పారు. కొన్ని పెద్దపాప స్నేహితురాళ్ళకు, కొన్ని ఇరుగు పొరుగు వాళ్ళకు, మరికొన్ని ఎక్స్ పేషెంట్లు అయిన స్నేహితురాళ్ళకు! నేను అప్పుడు అడగ లేదుగాని, నాకు మాత్రం అనుమానమేసింది: 'వీటన్నిటికీ ఈమెగారు డబ్బు పుచ్చుకుంటుందా?' అని!

కథలు రాయకపోతే రాయకపోయారు, నాన్నగారి నుంచి కనీసం కవిత్వం రాయడమైనా నేర్చుకోలేదేమిటి? అని అప్పుడప్పుడు అనిపించేది! కానీ అనేక సందర్భాలలో ఆమె అంత ర్ముఖురాలు కావడం నేను గమనించాను! కథలు, కవిత్వం రాయకపోయినా సృజనాక ప్రవృత్తి ఆమెలో వున్నట్టు నాకు గోచరించింది.

ఈ కారణంగానే డా॥ జయప్రదగారు మంచి డాక్టర్‌గా, గృహిణిగా తమ బాధ్యతలను అత్యంత సమర్ధవంతంగా నిర్వహిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. అటు పుట్టినింటి పేరూ ఇటు మెట్టినింటి పేరు నిలబెట్టారు. చివరకు ఒక ఆదర్శమైన మాతృమూర్తిగా కూడా రూపుదిద్దుకున్నారు. ఇంతకంటే కావలసిందేముంది?

సమాజంలోని అతి సామాన్యమైన వ్యక్తితోను, అత్యంత అసామాన్యమైన వ్యక్తితోను ఒకేరీతిగా మాట్లాడ గలిగిన వ్యక్తిత్వాన్ని ప్రతిరూపం సదాశివరావుగారు!. నూటికి నూరు పాళ్లు పల్లెటూరి మనిషిగా అనిపించిన మరో క్షణాన వైద్యశాస్త్రంలో ఇంతటి నిష్ణాతుడు ఆంధ్రదేశంలోనే అగుపించరేమో నన్నంత ఉన్నత శిఖరాన సాక్షాత్కరిస్తారు. ఈ రెంటి సమన్వయం మనకు ఆయనలో అడుగడుగునా కన్పిస్తుంది. పొలంగట్ల మీద పండే బెండ కాయల్ని గురించి, వంగ పూతను గురించి వచ్చినవాళ్ళతో ఎంత క్షుణ్ణంగా మాట్లాడతారో, అంతకంటే రెట్టించిన పరిజ్ఞానంతో సామాజిక స్థితిగతులను గురించి, విద్యావిధానాన్ని గురించి సాహిత్య ధోరణులను గురించి చర్చించి. అవతలి వాళ్ళను చిత్తుచేసిగాని, చివరకు స్టెతస్కోప్ తీసుకోరు!

పొరపాటు, డా॥ సదాశివరావుగారు స్టెతస్కోప్‌ను చాలా తక్కువగా ఉపయోగిస్తారని విన్నాను! నేను విన్న దాన్ని బట్టి డా॥ సదాశివరావుగారు మంచి సైకాలజిస్టు! మనిషిని చూస్తూనే మనస్తత్వాన్ని అర్థం చేసుకోగలధీశాలి. మనిషిని పరీక్షించ కుండానే నాలుగుగోడల అవతల వుండి కూడా జబ్బు ఫలానా అని తేల్చి చెప్పగలిగిన నైపుణ్యం ఒక్క డా॥ సదాశివరావు గారిలో మాత్రమే వున్నదని నా అభిప్రాయం.

ఒక రోగిని చూడ్డానికి డా॥ సదాశివరావుగారిని సంపన్నగృహస్థుడొ కాయన వాళ్ళింటికి తీసుకెళ్ళాడు. డ్రాయింగ్ రూం దాటి లోపలికి వెళ్ళబోతూ, అక్కడ సోఫాలో కూర్చొని ఏదో చదువుకుంటున్న యువకుడివైపు ఒక సారి తేరిపారచూసి, డాకర్టగారు లోపలికెళ్ళి రోగిని పరీక్షస్తూ వుండగా బయట డ్రాయింగ్ రూంలో నుంచి దగ్గటం విన్పించిందట! ఒక్కసారి ఉలిక్కిపడి, అసలు చూడడం ఆపివేసి, డ్రాయింగ్ రూంలో వున్న కుర్రవాడెవరని ప్రశ్నించారట! చివరకు వెడుతూ వెడుతూ, 'మీ అబ్బాయికి వచ్చిన ప్రమాద మేమీలేదుగాని ఆ డ్రాయింగు రూంలో కూర్చున్న కుర్రవాడి విషయంలో మాత్రం కొంచెం జాగ్రత్త తీసుకోండి. వెంటనే ఎక్స్‌రే తీయించండి.' అని మరీ మరీ చెప్పారట! ఆరోగ్యంగా బలంగా వున్నటు కన్పించే ఆ కుర్రవాడికి జబ్బేమిటని తాత్సారం చేయడంతో ఆ కుర్రవాడు కాస్తా వారానికే వాంతి చేసుకొని, డాక్టర్ సహాయం అందే లోపలే చనిపోయాడట!

అదాటుగా మనిషిని ఒక పర్యాయం చూచి మనిషిలోని రుగ్మతను ఇట్టే కనిపెట్టేయడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. ఇంత ప్రావీణ్యత ఉన్నందునే నేడు ప్రజా వైద్యశాల మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లడానికి అవకాశం వచ్చింది.

డా॥ సదాశివరావు గారి నిశిత పరిశీలనకు మరొక నిదర్శనం.

అప్పటికింకా ఆయన డాక్టరుగా బోర్డు కట్టలేదు. డా॥ జయప్రదగారి మెడలో తాళి కూడా కట్టలేదు. విశాఖపట్నంలో M. S. వీరరాఘవయ్య, వీరయ్యగార్ల స్నేహం చేస్తూ మధ్యలో ఎందుకో గుంటూరు వచ్చి, అరండల్ పేట 10వ లైనులో వున్న అన్నపూర్ణ పెళ్ళింటికి రావడం జరిగింది. లోపలికి వెడుతూ ఆయన వరండాలో మంచం మీద కూర్చొని ఏదో చదువుకుంటున్న ఒక కుర్రవాడి వైపు అలా ఒక దృష్టి పారేసి మరీ వెళ్ళారు. ఆ తరువాత ఎం.బి.బి.ఎస్. మూడవ సంవత్సరం చదువుతోన్న వీరరాఘవయ్యతో, 'ఎవరోయ్ ఆ వరండాలో మంచం మీద కూర్చొన్న కుర్రాడూ?..... నాకు చాలా Mild గా కన్పించాడు!' అని అన్నారట!

అవును, అతనిలో అప్పటికీ ఇప్పటికీ కూడ Mild గా ఉండే స్వభావం అలాగే నిలిచి వుంది. ఆ విషయం నాకెలా తెలుసునంటారా? ఆనాడు వరండాలో మంచం మీద కూర్చొని పుస్తకం చదువుతున్న వ్యక్తిని నేనే గనుక !

పొడుగాంటి ముక్కు కావడం వల్లనో ఏమో, ఏం మాట్లాడినా ముక్కుకు సూటిగా వెళ్ళే మనిషి లాగా, నిర్మొహ మాటంగా మాట్లాడేస్తారు. ఒక విషయం మీద కాదు, అనేక విషయాల మీద.! వైద్య శాస్త్రానికి సంబంధించిన పుస్తకాల కంటె సాహిత్య పరమైన పుస్తకాలు ఈయన చదివినన్ని మరెవరూ చదివి ఉండలేదేమో! ఒకసారి నన్ను, 'సాక్షి' సంపుటాలు చదివావా? అని ప్రశ్నించారు. వివిధ రకాలైన మనుషులతో పరిచయం వున్న కారణాన, అంత రంగాల లోతులను ఇట్టే పసికట్ట గలిగిన అమోఘమైన చాకచక్యం ఈయనలో వుంది. అందుకే అంతంత మాత్రాన ఎవరి రచనా ఈయనకు రుచించదు! ప్రజా జీవితాన్ని ప్రతిబింబింపజేసే రచనలంటె మాత్రం మహా ప్రీతి! రా.వి. శాస్త్రి రచనలను, బీనాదేవి కథలనూ, ముప్పాళ్ళ రంగ నాయకమ్మ నవలలను ఈయన మెచ్చుకుంటారు!

ఈయన నా కథల్ని మెచ్చుకున్నా మెచ్చుకొనకపోయినా 'ఆద్యంతాలు' అనే నా కథల సంపుటిని మాత్రం నేను వారికే అంకిత మిచ్చాను.

వైద్యశాస్త్రాన్ని గురించి, వైద్యశాస్త్రంలో వస్తున్న నూతన విధానాలను గురించి రేడియోలో డాక్టర్ సదాశివరావు గారిచ్చిన ప్రసంగాలు అమోఘమైనవని, వాటిని గ్రంథ రూపంలో తీసుకురావడానికి ప్రయత్నిస్తే, వైద్య రంగంలో కొత్తగా కాలిడే వ్యక్తులకు

మార్గదర్శకంగా వుండి పోగలదని తరచు మిత్రులు శ్రీ గుంటూరు రఘురాంగారు అంటూ వుంటారు!

వీరి దగ్గర తర్ఫీదు పొంది స్వంత వైద్య శాలలు పెట్టుకొని ఎంతో అభివృద్ధిలోకి వచ్చిన డాక్టర్లు అనేకమంది ఈనాడు ఆంధ్రదేశంలో నలుమూలల మనకు కన్పిస్తారు! **'ప్రజావైద్యశాల'లో** ఈ పాతిక సంవత్సరాల కాలంలో చికిత్స పొందిన వాళ్ళ సంఖ్యను గురించి లెక్కకట్టడం సాధ్యం కాని విషయం! లెక్కలేనంత మంది వ్యక్తుల ప్రేమకు పాత్రులైన డాక్టర్ సదాశివరావు గారిని గురించి, డా॥ జయప్రద గారిని గురించి ఎక్కువ చెప్పినా తక్కువగానే ఉంటుంది గనుక వీరుభయులను గురించి శ్రీ సంజీవదేవ్ గారు 'తెగిన జ్ఞాపకాలు' అనే తన గ్రంథంలో 1951 నెమరు వేసుకుంటూ ఒకచోట ఇలా అంటారు:

''డాక్టర్ సదాశివరావుగారు స్ఫురద్రూపి ప్రతిభగల సర్జన్‌గా రూపొందుతున్నారు. ప్రతిభాన్వితుడేగాక ఆయన మంచి **లౌక్యుడు.** సాంస్కృతిక విషయాలలో, ప్రత్యేకించి తెలుగు సాహిత్యంలో ఆయనకు మంచి అభిరుచి. డాక్టర్ జయప్రదాంబ కొంత గంభీర స్వభావురాలు. మంచి సాహితీప్రియ. స్వయంగా కొన్ని కథానికలను కూడా రచించింది ఆమె. ఆమెతండ్రి గారు కవి! ఆమె మంచి స్నేహశీలి! సహృదయ. ఈ ఆదర్శ డాక్టర్ దంపతుల "సేవమానవ సంఘాని కెంతగానో తోడ్పడగలదని భావిస్తాను."

శ్రీ సంజీవదేవ్ గారు ఇప్పటికి పాతిక సంవత్సరాల పూర్వమే భావించినట్లుగా ఈ ఆదర్శ డాక్టర్ దంపతుల సేవ మానవ సంఘాని కెంతగానో తోడ్పడింది; ఇంకా తోడ్పడుతుందని నేను ముందు కూడా భావిస్తున్నాను.

రజతోత్సవ సువర్ణాంజలి

విద్వాన్ కల్వాల రాజయ్య చౌదరి.

పేదసాదల దయ తోడ నాదరించి
వన్నె వాసులు గను ప్రజావైద్యశాల
భాసురంబగుచు జయప్రదా సదాశి
వకర విమల ప్రకాశ సౌవర్ణ మగును.

పంచవింశతి వత్సర ప్రౌఢినంది
రాజతోత్సవ ప్రభ దిశల్ ప్రాకెనేడు
స్వర్ణ కాంతులు మును మును వఱలుగాక
పాతికేండ్ల ప్రజాసేవ రీతు లెన్న
అల్ల సంజీవనీనామ మర్థ మగును.

ఎదురైన కవి పండి తేంద్రుల తన కారు.
నెక్కించు కొని గౌరవించువాడు
ఆషా స్మరణ సభ లంచితంబుగ నిర్వ
హించి సాహితిని నర్చించు వాడు.
వార్షి కోత్సవముల బాల్గొని సంతత
సాహిత్యగోష్ఠి నెసంగు వాడు
పేదసాదల గడు నాదరించు దయా
ధాముఁడై పేర్మిమై దనరు వాడు

కుప్పుసామి కళాశాల మెప్పులంద
పాలనాప్రౌఢి మెరసిన భవ్యమూర్తి
సాహితీ విదాంవరుడు రసజ్ఞ మూర్తి
వైద్య వరుడు సదాశివాహ్వయుడు రాజ
తోత్సవ సువర్ణ రేఖలు నొప్పు మీఱు.

వైద్యశాస్త్ర జ్ఞాన వనధిఁ ద్రచ్చు టె కాదు
సాహితీ సుధగ్రోలు సరసగుణుడు. .
శస్త్రచికిత్సా ప్రశస్తి గాంచుటెకాదు
భవ్యవాగ్గుంభన ప్రౌఢ వక్త
వ్యాధి నివారణ ప్రౌఢి గాంచుటె కాదు
అధి హరణ భాషణాంచితుండు
సరస వచోన్యాస పరత గాంచుటె కాదు
సాహితీ వర సదశ్చాల కుండు

సరసాంధ్ర భాషా రసజ్ఞుడే కాదాంధ్ర
"సెనెటు" సభ్యుండయి చెలగు వాడు.
హేతువాది సకల హితవాది మితవాది
మానవతావాది మాన్యగుణుడు

సర్వులకు సదాశివ కర సాధనుండు
కావున సదాశి వాఖ్య విఖ్యాతి మీఱి
సకల కార్య జయప్రదా సార్ధమూర్తి
భావుకుడు సదాశివరావు వైద్యవరుడు

ఆశా సంస్మరణము స
ర్వాజా జన మానసముల హత్తించిన స
ద్ధీశాలి మధుర గుణుడు స
దాశివున కగుత జయప్రద రస స్ఫూర్తుల్.

నాకు నచ్చిన డాక్టర్లు

బాలబంధు, బి.వి. నరసింహా రావు

డాక్టరు కాసరనేని సదాశివరావు గారు, వారి సతీమణి డాక్టరు జయప్రద గారు నాకు నచ్చడానికి అనేక కారణాలున్నాయి. నచ్చిన వారిని మెచ్చు కోవడం సహజం, ధర్మంకూడా.

ఈ డాక్టరు దంపతులు People's Nursing Home స్థాపించి గత ఇరవైయైదు సంవత్సరాలుగా వేల వేల మంది రోగులకు వైద్యసేవ చేస్తున్నారు. ధనం కంటే ఘనంగా ఖ్యాతి గడిస్తున్నారు. వారి సామర్థ్యాన్ని, సహృదయతను, సానుభూతిని చూరగొన్న రోగులకు వారు నచ్చడంలో ఆ రోగులు గౌరవ సత్కారాలు వారికి అందీయడంలో ఆశ్చర్యం లేదు. కాని ఎన్నడూ జబ్బుపడని, వైద్యసేవనందని నేను డాక్టరు సదాశివరాయ దంపతులను నచ్చిన డాక్టర్లని మెచ్చుకోబూనడం ఆశ్చర్యం గొల్పవచ్చు. అయినా మొట్ట మొదటే నేనన్నట్లు నాకు వారు నచ్చడానికి అనేక కారణాలున్నాయి.

వైద్యవృత్తి చాల గొప్పదనడానికి సందేహం లేదు. వైద్యుడు ప్రాణదాత కదా! ప్రాణముంటేనే ఏపనైనా సాధించగలిగేది. అందుకే వైద్యుని ఆజ్ఞలు ఎంత కఠినంగా ఉన్నా. అతని ఫీజు ఎంత ఎక్కువగా ఉన్నా. ఎవరూ అతన్ని విమర్శించడానికి సాహసించరు.

ఈనాడు ఎన్నో వృత్తులందున్న వారిని మనం చూస్తున్నాం. వారి వలన ఉపకారాన్నో, అపకారాన్నో పొందుతున్నాం. కాగా వారిలో ఏ ఒక్కరి మీద ఒక డాక్టరు మీద చూసినంత నిండైన, నిర్మలమైన అభిమానం చూపం. డాక్టర్లంతా పండితులనీ, పవిత్రులనీ కాదు. నిలిపితే ప్రాణాన్ని ఒక డాక్టరే నిలపగలడు. పునర్జన్మను ప్రసాదించగలడు. అది ఇంకెవరి వల్లా సాధ్యం కాదు.

ఈనాడు ప్రపంచంలో మానవుని ఆయుః పెరగడానికి డాక్టర్లే కారణం. అంతేకాదు, జనాభా పెరుగుదలను అరికట్టడానికి వారే కారణం.

డాక్టరు కేవలం మనిషి శరీరాన్నొకటే మరమ్మత్తు చేయగలడను కోవడం పొరపాటు. అతడు మనిషి మనస్సునీ సరిచేయగలడు. మనిషి యొక్క శరీరానికి, మనస్సుకీ గల అవినాభావ సంబంధం అవగతం చేసి కొన్నవాడే డాక్టరు. మన సెరిగి మందిస్తాడు.

మనసును సరిచేయగలిగితే మందు అవసరమే లేదని గ్రహిస్తాడు. అందుకే ఈ సూక్తి పుట్టి ఉంటుంది.

He's the best physician that knows the worthlessness of the most medicines. మందుల ఉపయోగం డాక్టరు ఉపయోగం అలా కాదు. డాక్టరు సదాశివరావు గారు అపరిమితమైన ఉపయోగాన్ని మేలును కూర్చగల మనీషి.

ఉత్తమ డాక్టర్ శ్రీ సదాశివరావు గారు. వారు పరిక్షించే (రోగనిదానం) పద్ధతి. ఆపరేషన్ పద్దతి ప్రత్యేకం. సులువుగా, సుతారంగా ఆపరేషన్లు అనేకం ఒక్కబిగిని చేయడంలో ఆయన సిద్ధహస్తుడు. ఆయన ప్రత్యేకత ప్రత్యేకం.

నాకు డాక్టరు గారితో పరిచయం ఏర్పడి పవిత్ర స్నేహంగా ప్రవర్ధమానం కావడం రెండు దశాబ్దాలు. కావస్తున్నది. వారితో నాకు గల స్నేహభాగ్యాన్ని ఎంతో విలువగా ఎంచుకుంటాను.

ఒక ఉన్నత పాఠశాల వార్షికోత్సవ సుసమయాన వారి పరిచయ భాగ్యం నాకు తొలుత లభించింది. ప్రధమ దర్శనంలోనే ఎత్తైన వారి విగ్రహం లోతైన వారి హృదయాన్ని నాకు విశద పర్చింది. నిజంగా నాకు అనిపిస్తుంది. డాక్టరుగారిలో నాలో ఏవో ఒకటి రెండు సమాన రేఖలున్నాయేమోనని, అనే మమ్మిద్దరినీ అంత దగ్గర అవగాహనలో, ఆత్మీయతలో చేర్చియుండ వచ్చునని.

తరువాత నేను గుంటూరులో వారి People's Nursing Home లో డాక్టరు గారిని, వారి శ్రీమతి డాక్టరు జయప్రదగారిని దర్శించాను. నాడే వారి గృహాన్ని కూడ దర్శించాను. శ్రీమతి జయప్రదగారు, శ్రీ కవివర్మ గారి ఏకైక పుత్రికని, తెలిసికొన్నాను. నాకెంతో ఆనందం ఆత్మబలం కలిగింది. శ్రీ కవివర్మ గారిని ఎన్నెనో ఎరుగుదును. వారు నాకు పితృసమానులు.

క్రమంగా డాక్టరు గారితో సాన్నిహిత్యాన్ని సత్స్నేహాన్ని నేను పదిలంగా పరిపోషించుకుంటూ, వారి వంట ఇంటి బంధువునే అయినాను. వారితోడి చెలిమికలిమి నాకు గౌరవం, ప్రచారం, పరిజ్ఞానం, ఆనందం అనేక విధాల సమకూర్చి పెట్టిందని గట్టిగా చెప్పగలను.

సదాశివరావు గారి సంస్కారం ప్రాక్తనం. సంస్కార మన్నది కేవలం విద్యాభి వృద్ధి వల్ల ప్రాప్తిస్తుందను కోవడం పొరపాటు. సంస్కారం గుర్తుకు రాక ఎందరివో జన్మ ప్రాకృతాలై పోవడం మనం చూస్తూనే ఉన్నాం.

సదాశివరావు గారు మిత్రులను మన్నించే తీరు ఎంతో హార్దికంగా ఉంటుంది. ఆయనలోని స్వాతంత్ర్య ప్రవృత్తి ఎట్టిదో, పాలన ప్రవృతీ అట్టిదే కావడం గొప్ప విశేషం. ఒక వంక మహద్వ్యక్తి నిజత్వ ప్రభావం వల్ల స్వతంత్రుడుగా భాసించినా, వేరొక వంక ఆయన సాటివారిలో సవర్ణుడూ, సహోదరుడుగా భాసించడమూ నేనెరుగుదును. ఆయన స్వతంత్ర ప్రవృత్తి భోగమైతే. ఆయన పాలన ప్రవత్తి యోగం. అవే ఆయనలోని మానవతకు, మహనీయతకు దోహదకారు లైనాయి.

భిన్న భిన్న కాలాల్లో సంప్రాప్తించిన భిన్న భిన్న వృత్తులకు, ప్రృతులకు సంబంధించిన మిత్రులున్నారు డాక్టరు గారికి.

నవనవోన్మిషిత ప్రతిభ, బుద్ధి గ్రహణ పారీణత, డాక్టరు గారిలో విజయ కీలకాలు.

ఈశ్వరచంద్ర విద్యా సాగరునిలోని ఉత్తమాంక నేను డాక్టరు సదాశివరావు గారిలో దర్శించాను. అదేమంటే ఏ పరిస్థితులందు ప్రధానంగా తన పై తాను దయచూపుకోవలసి యుంటుందో డాక్టరుగారు ఆ పరిస్థితులందు ఇతరులు పై దయాభావం చూపడం కాదు. నిజానికి దయాగుణం స్త్రీల యందుకంటే పురుషుల యందే ఎక్కువ. ఆ దయాశీలం, ధైర్యంతో, దీక్షతో, తోడ్పాటుతో డాక్టరు గారిలో పరిపూర్ణస్థితి నందింది.

వివేకం, విజ్ఞానం, లోకజ్ఞత, అవగాహన అద్భుతంగా కలవారు డాక్టరుగారు. అంతేకాదు అనేక సందర్భాల్లో ఆ గుణాలను దక్షతతో ప్రదర్శింపగల ధీరశక్తి సంపన్నులున్నూ వారు.

గుణసంపద రూపసంపద, విద్యాసంపదలన్నీ కలిగియూ సదాశివరావు గారు కట్నం లేకుండా జయప్రదాంబను పత్నిగా స్వీకరించడంలో గొప్ప వివేకం (wisdom) ఆదర్శం ప్రదర్శించారు. ధనానికంటె గుణానికి విలువ నిచ్చారు.

జయ ప్రదాంబ సదాశివరావు గారికి
'విల్లుకు నారిలా
సరసకు నారి అలా'!
వారిరువురి దాంపత్యం
'ఒకరికొకరు తోడు
ఒకరికొకరు జోడు
ఒకరివిడిచి చూడు

వేరొకరు సగమై నాడు.' అన్న సత్యానికి దర్పణం, యోగ్యత, నిపుణత, పట్టుదలవారి ప్రత్యేక వ్యక్తిత్వాల్లో ప్రదర్శితమైనా, వారిద్దరినీ ఒక్కటిగా భావించి దర్శించినపుడే పరిపూర్ణత, వారి పారీణతే దృగ్గోచరమౌతుంది. వారి పేర్లు కూడ చక్కగా అమరి అను మేళనజెందినాయి. వారి జీవితం 'సదాశివం' 'జయప్రదం'. అది నిత్యశుభంకరం. జయ పరంపర కాలవాలం. వారు పట్టిన దెల్ల బంగారం.

డాక్టరు దంపతులకు చాలచాల అభిరుచులున్నాయి. డాక్టరమ్మగారికి శాస్త్రీయ సంగీతం పట్ల మంచి అభిమానం. వారిరువురిలో సామాన్య లక్షణం సాహిత్యాభిమానం. క్షణం తీరికలేని వారికి సాహిత్యమంటే మిక్కుటమైన అభిమాన మన్న సంగతి చాలకాలం వరకు ఎవరికీ తెలియదు. ఆంతరంగికులకు మాత్రం తెలుసు. వారిరువురూ చక్కని సాహిత్య పాఠకులు. వివేచన మున్నవారు. ప్రాచీన ఆంధ్ర సారస్వతముపై మొగ్గు చూపుగలవారు, పద్యకావ్యాలు, గద్య కావ్యాలు ఒక స్థాయికి తగ్గినవి వారికి నచ్చవు. అతి అధునాతన వచన కవితాధోరణులు అసలు సరిపడవు. ఈ విషయంలో వారిరువురూ ఒక విధంగా Conservatives అని చెప్పాలి.

డాక్టరు సదాశివరావు గారు గుంటూరులో సాహితీ సదస్సు నొకదానిని స్థాపించి చాలా ఏళ్ళుగా మంచి దీక్షతో సాహిత్య దృష్టితో నిర్వహిస్తున్నారు. ప్రతి మాసం తప్పకుండా ఒక కార్యక్రమముంటుంది. సారస్వత, తాత్విక కళావేత్తలనూ, పండితులనూ, కవులనూ రప్పించి ఉపన్యాసాలిప్పించడం డాక్టరుగారి ఆత్మానంద కార్యకలాపం. ఆ సభలకు సానికులు, భాషాభిమానులు, స్త్రీ, పురుషులు చాలా ఉత్సాహంగా హాజరు కావటం జరుగుతున్నది. అప్పుడప్పుడు బైట గ్రామాల నుండి అభిమానులు శ్రోతలుగా రావడమున్నది. ఆ సాహితీ సదస్సులో నేను, శ్రీ సంజీవిదేవ్, శ్రీ కొండవీటి వెంకట కవి మొదలైన వారము గౌరవ సభ్యులుగా ఉన్నాము.

డాక్టరు లిద్దరూ మంచి పఠనాశక్తి గల వారే కాక, శ్రవణాశక్తీ గలవారు. వారు తమ కార్యక్రమం ముగించుకొని రాత్రివేళ 10 గంటల ప్రాంతాన మంచి పండితుడు ఉత్తమ కావ్యం ఒకటి వ్యాఖ్యాన సహితంగా చదువుతుండగా ఎంతో ఆసక్తితో వినడం కద్దు. మార్గానవారు చక్కని సాహిత్య పరిజ్ఞానాన్ని సముపార్జించుకోవడం పనిగా పెట్టుకున్నారు. నాకున్నూ కొన్ని సార్లు ఆ శ్రవణ భాగ్యం లభించింది.

సదాశివరావుగారు చక్కనివక్త. వారు చాలా సభలందు అధ్యక్షుడుగా, ఉపన్యాసకుడుగా పాల్గొనడం ఉన్నది. వారి వృత్తికి సంబంధించిన సమావేశాల్లోనేగాక, సాహిత్య సమావేశాల్లో, విద్యావిషయక సభలో ఉపన్యసించడం జరుగుతుంది.

వారు ఒక వక్తగానున్నా, అధ్యక్ష స్థానమలంకరించినా చాలా హుందాగా, సందర్భోచితంగా, క్లుప్తంగా మాట్లాడడం, ప్రేక్షకుల మన్ననలందడం ఉన్నది. వారి భాష, భావ వ్యక్తీకరణ చాలా హృద్యంగా, చిరుహాస్యం వ్యంగ్యం మిళితమై సాగుతుంది. వారు చాలా ఆలోచనా యుతంగా ప్రసంగిస్తారు. అతిగా మాట్లాడడం, కాలహరణం గావించడం వారికి ఇష్టంలేదు. ఆ కండూతి వారికి లేదు.

